

'సోమశిల'లో నీటిమట్టం

అనంతసాగరం జూలై 25 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయంలో 28.222 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా, ఎగువ నుంచి శుక్రవారం 6,799 క్యూసెక్కుల వరద వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 320, దక్షిణ కాలువకు 400, పెన్నాడెల్టాకు 2,600 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

నేడు కార్గిల్ విజయోత్సవ దినం

వారి త్యాగం.. మనకు ఫలం



నాటి యుద్ధంలో జిల్లా వారు 22 మంది

నగరంలో విజయోత్సవ ర్యాలీ.. పోరాటయోధులకు నేడు సత్కారం

ఓ పక్క ప్రాణాలు కాపాడుకుంటూనే మరోపక్క భారత్‌పైకి దూసుకొస్తున్న పాక్ సైన్యాన్ని ధీటుగా ఎదుర్కొంటూ వీరోచితంగా పోరాడిన మన సైన్యం పోరాట పటిమను ఇప్పటికీ మరువలేం. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధం ప్రతి ఒక్కరి మదిలో మెదులుతూనే ఉంది. ఈ గొప్ప విజయానికి నేటికి 26 ఏళ్లు. ఈ శుభసందర్భాన్ని పురస్కరించుకొని విజయోత్సవాలు జరుపుకునేందుకు యావత్తు దేశం సిద్ధమైంది. సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని వీఆర్సీ నుంచి కలెక్టరేట్ వరకు ఉదయం పది గంటలకు కార్గిల్ విజయోత్సవ ర్యాలీ జరగనుంది. ఆ తర్వాత తిక్కన ప్రాంగణంలో నాడు యుద్ధంలో పాల్గొన్న సైనికులను కలెక్టర్ ఆనంద్ సత్కరించనున్నారు.

- వివరాలు 8లో

ఇప్పటికీ రోమాలు నిక్కబొడుచుకుంటాయ్!



రక్తం గడ్డకట్టే చలిలో పాక్ సైన్యాన్ని ఎదిరించాం

ఆ యుద్ధం నుంచి బతికి ఉన్నామంటే దేవుడి దయే!

'కార్గిల్ యుద్ధం.. ఈ మాట వింటే ఇప్పటికీ నా రోమాలు నిక్కబొడుచుకుంటాయి. జమ్మూ, శ్రీనగర్ బేస్ ఆపరేషన్స్‌లో పని చేశాను. 1999, మే నెలలో పెట్రోలింగ్‌లో ఉన్న మన సైన్యంపై పాకిస్థాన్ మిలటరీ దళం మన భూభాగాన్ని ఆక్రమించి దాడికి పాల్పడింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరు సైనికులు హెడ్‌క్వార్టర్‌కు వచ్చి సమాచారం ఇచ్చారు. నేను బెటాలిక్ సెక్టార్‌లో పని చేశాను. పగటిపూట ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేం. శత్రు దేశం సైనికులు అటాక్ చేస్తున్నారు కాబట్టి రాత్రిళ్లు మాత్రమే కొండలమీద 15 నుంచి 20 కి.మీల వరకు రక్తం గడ్డకట్టించే చలిలో ప్రత్యర్థుల దాడిని ఎదుర్కొంటూ మరోవైపు దారి చేసుకుంటూ నదులపై వంతెనలు ఏర్పాటు చేసుకుంటూ ముందుకు పోవాలి. సరిపడా రేషన్ ఉండదు. దాదాపు 20 రోజుల వరకు కఠినమైనవి. పాకిస్థాన్ సైన్యం దాడుల్లో గాయపడిన వారిని కూడా తిరిగి 15 నుంచి 20 కి.మీ కిందకు కర్రలపై ఎత్తుకుని వచ్చి చికిత్స చేయించేవాళ్లం. మన హెలిప్యాడ్ బేస్ క్యాంపును ఆక్రమించిన పాక్ సైన్యం కదలికలను గమనిస్తూ దాడి చేసి అదుపులోకి తీసుకున్నాం. ఆ తరువాత నుంచి మాకు రేషన్, మందులు అందేవి. ఆపరేషన్స్‌లో ఉంటే కుటుంబం అనే ఆలోచనే ఉండదు. మమ్మల్ని మేము కాపాడుకోవడం.. దేశరక్షణ కోసం వెనకడుగు మాటే ఉండదు. కార్గిల్ నుంచి బయటపడి బతికి ఉన్నామంటే ఆ దేవుడి దయే. అంతకంటే ఏమీ చెప్పలేము. అదో కఠినమైన యుద్ధం. తలుచుకుంటే రోమాలు నిక్కబొడుచుకుంటాయి. రాజస్థాన్, పంజాబ్ ఇలా చాలా బేస్‌లలో పని చేశాను. 2022లో పదవీవిరమణ అయ్యాను. ప్రభుత్వం ఇచ్చే పింఛను తప్ప ఎలాంటి ప్రోత్సాహకాలు అందలేదు. అన్నీ హామీలే.. ఒక్కటీ నెరవేరలేదు.

- టి.శ్యాంసన్, నాయిబ్ సుబేదార్, నెల్లూరు

వారంలో రికార్డులు ఇవ్వండి!

'యాక్సిస్' అధికారులకు పోలీసుల నోటీసులు

నెల్లూరు (క్రైం), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : యాక్సిస్ బ్యాంక్ కుంభకోణం కేసులో విచారణను పోలీసులు వేగం పెంచారు. ఈ కుంభకోణానికి సంబధించిన ఫైల్స్‌ను అందజేయాలని గతంలోనే పోలీసులు బ్యాంకు అధికారులను కోరినా వారు స్పందించలేదు. ఈ మధ్య నెల్లూరు రూరల్ డీఎస్పీ కార్యాలయంలో బ్యాంకు మేనేజర్‌ను విచారించారు. గతంలో తాము అడిగిన ఫైల్స్ అందించాలని సూచించారు. అయినా వారి నుంచి స్పందన లేకపోవడంతో గురువారం బ్యాంక్ అధికారులకు నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో బ్యాంక్‌లో జరిగిన కుంభకోణానికి సంబంధించిన ప్రతి ఫైల్ తమకు అందించాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. అప్పటికి స్పందించకపోతే విచారణను వేగవంతం చేసేందుకు పోలీసులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తుంది.

పీఎంశ్రీ పాఠశాలల్లో జెండా పండుగకు రూ.11.5లక్షలు

నెల్లూరు(విద్య, ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పీఎంశ్రీ పాఠశాలల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. సమగ్రశిక్ష పర్యవేక్షణలో జిల్లాలోని 46 పీఎంశ్రీ పాఠశాలలకు ఒక్కో దానికి రూ.25వేలు చొప్పున మొత్తం రూ.11.5 లక్షలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ బీ శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. జెండా ఆవిష్కరణ, సౌండ్ సిస్టమ్‌కు రూ.2వేలు, పాఠశాల స్థాయిలో ఆటల నిర్వహణకు రూ.5వేలు, చారిత్రక సంఘటనలపై స్కిట్‌ల నిర్వహణకు రూ.3వేలు, వ్యాసరచన, క్విజ్ పోటీలకు రూ.5వేలు, విద్యార్థులకు బహుమతులు, కార్యక్రమ నిర్వహణకు రూ.10 వేలు వినియోగించాలని సూచించారు. ఈ మేరకు ఎంఈవోలు, హెచ్‌ఎంలకు ఆదేశాలిచ్చి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తామని సమగ్రశిక్ష ఏపీసీ వెంకట సుబ్బయ్య తెలిపారు.



నెల్లూరు: నగరంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు



శాంభవీ... శరణు శరణు !

వైభవంగా శ్రావణ మాసోత్సవాలు

తొలి శుక్రవారం ఆలయాల కిటకిట

సామూహిక కుంకుమార్చనలు, విశేష పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం మొదలైంది. తొలిరోజే శుక్రవారం కావడంతో జిల్లా వ్యాప్తంగా అమ్మవారి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. సామూహిక కుంకుమార్చనలు, మూలవర్లకు పూలంగిసేవలు, పల్లకీ సేవలు, ప్రాకారోత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. నెల్లూరులోని రాజరాజేశ్వరి ఆలయంలో ఉదయం లలితా సహస్రనామ సామూహిక లక్ష కుంకుమార్చన జరిగింది. మధ్యాహ్నం అన్నదానం చేశారు. నగరంలోని కన్యకా పరమేశ్వరి, ఇరుకళల పరమేశ్వరి ఆలయాల్లో శ్రావణ మాస ప్రారంభ వేడుకలు జరిగాయి. అలాగే పెంచలకోన, జొన్నవాడ, నృసింహకొండ, ఆత్మకూరు, కావలి, కందుకూరు, ఉదయగిరి తదితర ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో శోభిల్లాయి.



రాపూరు : పెంచలకోనలో ఆదిలక్ష్మికి ప్రాకారోత్సవం



వింజమూరు : ప్రజలకు కరపత్రాలు అందచేస్తున్న మంత్రి పార్థసారథి, పక్కన ఎమ్మెల్యే కాకర్ల సురేష్

ప్రజాస్వామ్యంలో ప్రజల ఆశీర్వాదమే కొలమానం

రప్పా.. రప్పా... అంటే కుదరదు

ప్రజలు అంతకంతకు చెల్లిస్తారు!

జిల్లా పర్యటనలో రాష్ట్ర మంత్రి పార్థసారథి

- వివరాలు 8లో..

బీపీసీఎల్ అధికారుల తీరుపై ట్రాన్స్‌పోర్టర్ల నిరసన 8

దేవాలయాల పాలక మండళ్ల నియామకం ప్రహసనంగా మారుతోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటికి రెండు సార్లు ఆలయాల పాలక మండళ్ల కోసం నోటిఫికేషన్లు జారీ చేసింది. కానీ, నియామకాలు మాత్రం జరగలేదు. తాజాగా ఈనెల 10న జిల్లాలోని 45 ఆలయాలకు పాలక మండళ్ల నియామకం కోసం దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 30లోపు పాలక మండళ్ల సభ్యుల వివరాలతో జాబితాలను కమిషనర్ కార్యాలయానికి పంపాలని అందులో పేర్కొన్నారు. అయితే, ఇప్పటివరకు 10, 12 దేవాలయాలకు సంబంధించి మాత్రమే జాబితాను కమిషనర్ కార్యాలయానికి పంపినట్లు తెలిసింది. గడువు సమీపిస్తున్నా ఇప్పటి వరకు మిగిలిన ఆలయాల దరఖాస్తుల్లో పురోగతి లేకపోవడం గమనార్హం.

జిల్లాలో 45 ఆలయాల పాలక మండళ్లకు నోటిఫికేషన్

ఆదాయం లేనివా..

అయితే వద్దులే!!

- దరఖాస్తుకు ఈనెల 30 వరకు గడువు
- ఇప్పటి వరకు 10, 12 గుళ్లకే జాబితాలు సిద్ధం
- ఆదాయం లేకపోవడంతో ఆసక్తి చూపని వైనం..
- దృష్టిపెట్టని స్థానిక ప్రజా ప్రతినిధులు
- గడువులోపు ఎంపిక పూర్తయ్యేనా?



నెల్లూరు (సాంస్కృతికం), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : చిన్న ఆలయాలపై ఆసక్తి కరువు ఆలయ పాలక మండలి సభ్యుడిగా పనిచేయాలనుకునే వ్యక్తులు ఆయా ఆలయ ఈవోలకు దరఖాస్తు చేసుకోవాలి. ఈవోలు సదరు సభ్యుల పూర్వాపరాలను పోలీసు, ఇతర శాఖల దృష్టికి తీసుకుపోయి సభ్యుల అర్హతను గుర్తించి ఆ మేరకు కమిషనర్‌కు జాబితా పంపుతారు. అయితే అనధికారికంగా స్థానిక శాసన సభ్యులే దేవాలయ పాలక మండలి సభ్యుల జాబితాలను సిద్ధం చేసి వాటిని ఆయా ఆలయాల ఈవోలకు పంపడం రివాజుగా మారింది. అయితే ఈసారి ప్రజాప్రతినిధులు ఆలయాల పాలక మండలి సభ్యుల ఎంపికపై దృష్టి సారించకపోవడంతో ప్రక్రియ ఆలస్యమవుతోంది. అంతేకాక, రిజర్వేషన్ల ప్రకారం సభ్యులను ఎంపిక చేయాల్సి రావడం ప్రజాప్రతినిధులకు తలపోటుగా మారింది. గతంలో ఆలయాల కమిటీకి ఎంపిక చేయమని ప్రజాప్రతినిధులను అధికార పార్టీ కార్యకర్తలు ఒత్తిడి చేసి మరీ సభ్యులుగా చేరేవారు. కానీ, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. ఇప్పుడు నోటిఫికేషన్ విడుదలైన ఆలయాల్లో ఆదాయం కలిగినవి అంతంత మాత్రంగా ఉండడంతో వాటి పాలక మండళ్లలో చేరేందుకు అధికార పార్టీ కార్యకర్తలు అంతగా ఉత్సాహం చూపడంలేదనే ప్రచారం జరుగుతోంది. దరఖాస్తు గడువుకు ఇక రోజులే ఉంది. ఈలోపు అన్నీ ఆలయాల పాలక మండలి సభ్యుల ఎంపిక పూర్తవుతుందా అనేది ఆ దేవుడికే తెలియాలి!.

రూ.25 లక్షల్లోపే ఆదాయం

ప్రస్తుతం నోటిఫికేషన్ ఇచ్చిన ఆలయాల్లో చేజర్ల మండలం కోటితీర్థం క్షేత్రం, విడవలూరు మండలం రామతీర్థంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం, వింజమూరు మండలం నల్లగొండ్ల లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, ముత్తుకూరు చెన్నకేశవ స్వామి ఆలయం, నెల్లూరు నగరంలోని నవాబుపేట మల్లేశ్వరాలయం, ఉస్మాన్‌సాహెబ్ కోదండరామ స్వామి కాశీ విశ్వేశ్వరాలయం, మొగుళ్లపల్లి వారి సత్రం, చీదెళ్ల వారి సత్రం, ఇందుకూరుపేట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం, అల్లూరులోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయం, సంగం భీమేశ్వర స్వామి ఆలయం, బుచ్చి మండలం దామరమడుగులోని మల్లికార్జున స్వామి ఆలయం వంటివి ఉన్నాయి. నోటిఫికేషన్ జారీ చేసిన 45 ఆలయాలు కూడా రూ.25లక్షల్లోపు వార్షిక ఆదాయం ఉన్నవే కావడంతో వాటి పాలక మండళ్లలో చేరేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని సమాచారం.

రిజర్వేషను ఇలా...

- రూ.5లక్షల నుంచి రూ.25 లక్షలలోపు ఆదాయం ఉన్న ఆలయాలకు ఎక్స్‌అఫిషియో సభ్యులుగా నాయీ బ్రాహ్మణ్, బీసీ, ఎస్సీ లేదా ఎస్టీలతో పాటు మొత్తం 10 మంది కమిటీ సభ్యులుగా ఉంటారు. అందులో 50 శాతం మహిళలకు కేటాయించాల్సి ఉంటుంది.
- రూ.25లక్షల నుంచి రూ.5కోట్లలోపు ఆదాయం ఉన్న ఆలయాలకు 12 మంది కమిటీ సభ్యులు ఉంటారు. వారిలో 50 శాతం మహిళలకు కేటాయించాలి.

జాకెట్, చీర లాగేసి..

మహిళపై జనసేన పార్టీ నాయకుడి దాష్టీకం • దాడిలో కుమారుడికీ గాయాలు

పొలంలో అక్రమంగా దారి వేస్తుండగా అడ్డుకున్నందుకే! • పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

ఏఎస్ పేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పొలంలో అక్రమంగా దారి వేయడమే కాదు.. అడ్డొచ్చిన తల్లీకొడుకుపై జనసేన పార్టీకి చెందిన ఓ నాయకుడు విచక్షణా రహితంగా దాడి చేశారు. మహిళ చీర, జాకెట్‌ను లాగేయడమేగాక, బంగారు సరుడును లాక్కొని వెళ్లిపోయారు. ఏఎస్ పేట మండలం పెద్ద హబీపురం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు... పెద్ద హబీపురం గ్రామనికి చెందిన అనసూయమ్మ, జనసేన పార్టీకి చెందిన నాయకుడు ఊస వెంకటరావుల పొలాలు పక్కపక్కనే ఉన్నాయి. ఈ తరుణంలో శుక్రవారం ఉదయం వెంకటరావు తన పొలం కోసం అనసూయమ్మ పొలంలో నుంచి జేసీబీ ద్వారా దారి ఏర్పాటు చేస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న అనసూయమ్మ తన కుమారుడు సాయినాథ్‌ను వెంట బెట్టుకుని పొలం వద్దకు చేరుకుని, పనులను అడ్డుకుంది. దీంతో ఆగ్రహించిన వెంకటరావు తన కుటుంబ సభ్యులతో కలిసి అనసూయమ్మపై దాడి చేసి గాయపరిచాడు. అంతేగాక ఆమె జాకెట్, చీర చిరిగేలా లాగేసి మెడలోని బంగారు సరుడును కూడా లాక్కొన్నారు. అడ్డువచ్చిన ఆమె కుమారుడిపై కూడా దాడి చేసి గాయపరిచారు. దీంతో తల్లీకొడుకు ఇద్దరూ ఏఎస్‌పేట పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు. గాయపడిన తల్లీకొడుకును ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు.



జనసేన పార్టీ నాయకుడు దాడి చేయడంతో పొలంలోనే పడిపోయిన అనసూయమ్మ

వసూళ్లకు పాల్పడిన కానిస్టేబుల్ వీఆర్‌కు..

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వేస్టేజ్ వాహనాలవద్ద వసూళ్లకు పాల్పడిన కానిస్టేబుల్‌పై పోలీసు ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు. గురువారం ఆంధ్రజ్యోతిలో 'పోలీసు అధికారి పేరు చెప్పి రూ.50 వేలు వసూలు' శీర్షికన వార్త ప్రచురితమైన విషయం విదితమే. ఈ విషయంపై సీఐ శ్రీనివాసులురెడ్డిని వివరణ కోరగా కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపనున్నారని, జిల్లా ఎస్పీ నుంచి ఆదేశాలు రాగానే సదరు కానిస్టేబుల్ ను వీఆర్‌కు పంపిస్తామని తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9458
వెండి కిలో ధర	రూ. 118200
వెండి ఒక గ్రాము	రూ. 121.20



రైతులు సాగునీటి శిస్తులు చెల్లించాలి

రమాదేవి, తహసీల్దార్

మనుబోలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు సాగునీటి శిస్తులు తప్పనిసరిగా చెల్లించి రెవెన్యూ అధికారులకు సహకరించాలని తహసీల్దార్ రమాదేవి పేర్కొన్నారు. ఎలాంటి చలానా లేకుండానే జాయింట్ ఎల్‌పీఎంలు విడగొట్టేలా రైతులకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు.

?.. మనుబోలు రీసర్వే ప్రక్రియ ఎంతవరకు వచ్చింది ?

!... క్షేత్రస్థాయి సర్వే అయింది. వీఆర్వో లాగిన్ వర్క్ వేగంగా జరుగుతోంది. రెండునెలల్లో పూర్తిచేసేలా ప్రణాళిక వేసుకుని పని చేయిస్తున్నాం.

?.. రీ సర్వేలో ఎకరాకు 5నుంచి 10 సెంట్లు భూమి తగ్గుతుందని ఆరోపిస్తున్నారు. నిజమేనా ?

!... అలా ఏమీ జరగదు. రైతులు చూపించిన బౌండరీల ప్రకారమే సర్వే చేస్తారు. ఓవర్ ఎంత చూపుతుందో దాని ప్రకారమే వస్తుంది.

?..జాయింట్ ఎల్‌పీఎంలు ఎందుకు ఇచ్చారు ?

!... రీ సర్వే జరిగే సమయంలో రైతులు అందుబాటులో లేనప్పుడు జాయింట్ ఎల్‌పీఎంలు ఇచ్చి ఉంటారు. దీనివల్ల రైతులకు ఇబ్బందే. దీనిని విడగొట్టాలంటే గతంలో చలానా రూ. 500 ఉండేది. దానిని రూ. 50కి తగ్గించారు. ప్రస్తుతం ఉచితంగానే చలానా లేకుండానే జాయింట్ ఎల్‌పీఎంలు విడగొట్టేలా రైతులకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది.

వానాకాలం.. వ్యాధుల భయం!

- రోడ్లపైనే మురుగునీరు
- పారిశుధ్య చర్యలు నిల్
- నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

కొడవలూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం ప్రారంభమైంది. మండలవ్యాప్తంగా పల్లెల్లో చాలా చోట్ల డ్రైనేజీ వ్యవస్థ కానరాని పరిస్థితి నెలకొంది. కొన్ని చోట్ల కాలువల్లో పూడిక తీయకపోవడంతో మురుగునీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. అధికారులు గ్రామాల్లో మురుగునీరు నీరు నిల్వ ఉండకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● మండలంలో ఇదీ పరిస్థితి..!

మండలంలో మొత్తం 24 పంచాయతీలున్నాయి. వాటిలో కొడవలూరు, యల్లాయపాలెం, కొత్తవంగళ్లు, రేగడిచెలిక, రామన్నపాలెం, మానేగుంటపాడు, గండవరం మేజర్ పంచాయితీలున్నాయి. చాలా గ్రామాల్లో డ్రైనేజీలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వానకే మురుగునీరు నిల్వ ఉంటోంది. పరిసరాలు చిత్తడిగా మారుతున్నాయి. దీనివల్ల దోమలు వ్యాప్తి చెంది ప్రజలు వ్యాధులబారిన పడుతున్నారు.



కొళాయి వద్ద నిల్వ ఉన్న మురుగునీరు

● నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రాలు

గ్రామాల్లోని రహదారుల్లోనూ, నివాసాల వద్ద చెత్త పేరుకుపోయింది. సంపద తయారీ కేంద్రాలకు తరలించి ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రంలో తడి, పొడి చెత్తగా వేరు చేయాలి. అనంతరం సేంద్రీయ ఎరువును తయారీ చేసి విక్రయించాలి. టీడీపీ హయాంలో చెత్త సేకరణకు ఇచ్చిన ట్రాక్టర్లను గత వైసీపీ ప్రభుత్వం మూలన పడేసింది. పంచాయతీ కార్యాలయాల వద్ద ఇవి నిరుపయోగంగా పడి ఉన్నాయి. రాష్ట్రప్రభుత్వం సంపద కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో ఘన వ్యర్థాల కేంద్రానికి చేరడం లేదు. దీంతో గ్రామాల్లో చెత్త సేకరణ ప్రక్రియ అంతంతమాత్రంగానే సాగుతోంది.

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోండి

- అధికారులు, పోలీసులకు గిరిజనుల ఫిర్యాదు

మనుబోలు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తమ ఇళ్లను పూర్తిగా నిర్మించకుండా మోసం చేసిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వీరంపల్లి పంచాయతీ లింగారెడ్డికి చెందిన గిరిజనులు శుక్రవారం పోలీసులు, ఎంపీడీవో జలజాక్షికి ఫిర్యాదు చేశారు. మూడేళ్ళ క్రితం కాంట్రాక్టర్ తమకు నెలరోజు ల్లోపే ఇళ్లు కట్టిస్తామని నమ్మించా డన్నారు. గ్రా మంలో 21 ఇళ్లు కట్టాల్సి ఉండగా ఒక్కటి కూడా పూర్తి చేయలేదన్నారు. తమ ఇళ్లకు రావాల్సిన సిమెంట్, ఇసుక, కమ్మీలకు బిల్లులు చేసుకుని ఆయనే కాజేశాడన్నారు. అవికాక నలుగురి వద్ద అదనంగా డబ్బులు తీసుకున్నాడన్నారు. పలుమార్లు గృహనిర్మాణ శాఖాధికారులకు ఫిర్యాదు చేశామని, అధికారులు 3 నోటీసులు ఇచ్చినా కాంట్రాక్టర్ సమాధానం చెప్పలేదన్నారు. వర్షాకాలంలోపు తమకు ఇళ్లు కట్టించి ఇవ్వాలని, లేదంటే మళ్ళీ గుడిసెలు వేసుకోవాల్సిందేనని వారు వాపోయారు.



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన లింగారెడ్డిపల్లి గిరిజనులు

ఉగాదికల్లా నగర పంచాయతీ భవనం సిద్ధం

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బుచ్చి నగర పంచాయతీ భవనాన్ని నాణ్యతా ప్రమాణాలతో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ అన్నారు. శుక్రవారం వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కాంట్రాక్టర్ వీవీ శేషయ్యతో కలిసి చైర్‌పర్సన్, కమిషనర్‌లు పూజ చేసి మొదటి అంతస్థు శ్లాబు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణానికి నిధులు సమస్యలు ఎదురైనా ఎమ్మెల్యే సహకారంతో పనులు పూర్తిచేసి ఉగాదికి ప్రారంభించేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్య క్రమంలో వైస్ చైర్మన్లు, శివకుమార్‌రెడ్డి, నస్రీన్‌ఖాన్, కౌన్సిలర్లు లక్ష్మీ కాంతమ్మ, శ్రీదేవి, సత్యం, మల్లారెడ్డి, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న చైర్‌పర్సన్ సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ తదితరులు

భూమిని కబ్జా చేస్తే చర్యలు

రాపూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఎవరైనా కబ్జాకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవని రాపూరు తహసీల్దారు లక్ష్మీనరసింహం హెచ్చరించారు. రాపూరు మద్దెలమడుగు వద్ద బిట్ నెంబరు 3లో సర్వే నెంబరు 1080/3లో ప్రభుత్వ భూమిని గత కొంతకాలంగా ఒక వ్యక్తి కబ్జా చేసి ఆ భూమిలో లేఅవుట్ వేసి కొన్ని ప్లాట్లు అమ్మాడన్నారు. ఈ విషయం తహసీల్దారు దృష్టికి రాగా వీఆర్వో రాజేశ్వరి ద్వారా ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

శ్రావణ శుక్రవారం పూజలు

రాపూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రంలో మొదటి శ్రావణ శుక్ర వారం పురస్కరించుకుని ఆదిలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి అభిషేకాలు, సాయంత్రం ప్రాకారోత్సవం, సామూహిక కుంకుమార్చన ఆలయ ప్రధానార్చకులు, వేద పండితుల మంత్రోచ్చరణలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మడమనూరులో ఉచిత వైద్యశిబిరం



గుండె పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

మనుబోలు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మడమనూరు ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆదేశాలతో శుక్రవారం ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య కేంద్రం, స్వర్ణభారత్ నేత్రవైద్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. విజన్ టెక్నీషియన్లు బిందు ప్రియదర్శిని, శ్రావ్యలు కంటిపరీక్షలు నిర్వహించారు. కంటి శస్త్రచికిత్సలు అవసరమైన వారిని గుర్తించి స్వర్ణభారత్ ట్రస్టు ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. మరికొందరికి గుండె సంబంధిత పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నూనె లక్ష్మయ్య, చెమిర్తి సుధీర్, ఉడతా విజయ్‌కుమార్, మాసం సాహెబ్, గుమ్మా సురేష్, ఇరగరాజు శ్రీనువాసులు, అనింగి శరత్‌కుమార్, పముజుల నాగరాజు, తురకా వెంకటేశ్వర్లు, ట్రస్టు కోఆర్డినేటర్ అనూప్‌బాబు, ఉదయ్ భాస్కర్, అజిత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంత... ప్రయాణికులకు చింత

మనుబోలు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మనుబోలు - పొదలకూరు మార్గంలో మడమనూరు జగనన్న లేఅవుట్ వద్ద రోడ్డుపై పెద్ద గుంత ఉంది. దీంతో నిత్యం ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు, ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. రెండేళ్ల క్రిత ం ఇక్కడే అప్పటి బీజేపీ మండలాధ్యక్షుడు ఓడూరు శ్రీనువాసులు రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అప్పటి ఎస్ఐ. అజయ్‌కుమార్ గులకరాళ్ళు, యాష్ పౌడర్ తోలించినా కొద్ది కాలానికే దెబ్బ తినింది.. దీంతో ఎమ్మెల్యే సోమిరెడ్డి ఓసారి ఈ మార్గంలో వెళుతూ గుంతలు పడ్డ రహదారిని పరిశీలించారు. వెంటనే స్పందించారు. మనుబోలు-పొదలకూరు మార్గంలో దాదాపు 7 కి.మీ మేర మరమ్మతుల కోసం రూ. 10 లక్షలు మంజూరు చేయించారు. అయితే సదరు కాంట్రాక్టర్ సరిగా మరమ్మతులు చేయకపోవడంతో ఏడాదికూడా పూర్తి కాకుండానే అక్కడే మళ్లీ లోతుగా గుంత ఏర్పడింది. ఆర్‌అండ్‌బి అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణీకులు కోరుతున్నారు.



మనుబోలు-పొదలకూరు రోడ్డుపై ఉన్న గుంత

అచ్యుతానందన్‌కు నివాళి

కోవూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం అగ్రనాయకుడు అచ్యుతానందన్‌కు స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం జిల్లా నాయకుడు మోహనరావు, గండవరపు శేషయ్య, బుజ్జయ్య, మారుబోయిన సుబ్బారావు, అఫ్రోజ్, పెద్దన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పొలం రీ సర్వేకి అనుమతి

కోవూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కోవూరు పొలం రీ సర్వేకి గ్రామసభ శుక్రవారం అనుమతిచ్చింది. గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో రీ సర్వే ముసాయిదాను అనుమతించారు. కోవూరులోని పట్టా, ప్రభుత్వ భూమిని సమగ్రంగా సర్వే చేసి గ్రామసభలో ముసాయిదాను రెవెన్యూ సిబ్బంది ప్రవేశ పెట్టింది. తహసీల్దారు సీహెచ్ సుబ్బయ్య, సర్పంచు యాకసిరి విజయ, మాజీ ఉప సర్పంచు గాదిరాజు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దత్తత స్వీకారానికి ముందుకు రావాలి

- మహేంద్రను సన్మానించిన డ్వామా పీడీ గంగాభవాని



మహేంద్రను సన్మానిస్తున్న డీఆర్‌డీఏ పీడీ నాగరాజకుమారి

మనుబోలు, జూలై 25(ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలను దత్తత తీసుకునేందుకు గ్రామాల్లో శ్రీమంతులు ముందుకు రావాలని సర్వేపల్లి నియోజకవర్గ ప్రత్యేకాధికారి డ్వామా పీడీ గంగాభవాని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠా త్మకంగా అమలు చేస్తు న్న 'బంగారు కుటుంబాలు-మార్గదర్శకులు' కార్యక్రమంపై వెంకటాచలంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మనుబోలు మండలంలోని కట్టువపల్లిలోని ఒక బీసీ, 5 దళిత కుటుంబాలను ఆ గ్రామానికి చెందిన టీడీపీ యువనాయకుడు యరటపల్లి మహేంద్ర దత్తత స్వీకారానికి ముందుకు వచ్చారు. దీంతో ఆయన్ను డ్వామా పీడీ సన్మానించి, అభినందించారు. ఏఎంసీ చైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్యలు మహేంద్రను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, సర్వేపల్లి నియోజకవర్గ విజన్ బృందం సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా కామాక్షితాయికి లక్ష కుంకుమార్చన

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం తొలి శుక్ర వారం సందర్భంగా మండలంలోని జొన్న వాడ శ్రీ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అలంకార మండపంలో కామాక్షితాయి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ పండితులు, పురోహితులు ముత్తైదువలతో లక్ష కుంకుమార్చన సాయంత్రం అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, పల్లకీ సేవలు జరిగాయి.



భక్తులతో కిటకిటలాడుతున్న జొన్నవాడ ఆలయం

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

ప్రజా ప్రతినిధుల గైర్హాజరు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాల్సిన ప్రజా ప్రతినిధులే మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరు కావడం గమనార్హం. మరోవైపు కోరం వుంటే చాలన్నట్టుగా శుక్రవారం బుచ్చి ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం తహసీల్దారు వేంకటేశ్వర్లు, ఎంపీడీఓ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ శ్రీనివాసులు అధ్యక్షతన మొక్కుబడిగా సాగింది. పెనుబల్లి ఎంపీటీసీ బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు వినయ్ నారాయణ ప్రధానంగా రైతుల సమస్యలపై గళం వినిపించారు. రైతులకు యూరియా, ఈకేవైసీ సమస్యలు లేకుండా చూడాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది నామమాత్రంగా నిర్వహించే ఈకేవైసీ నమోదు వల్ల రైతులు నానా అవస్థలు పడుతున్నారన్నారు. రైతులకు సబ్సిడీ పవర్ స్ప్రేయర్లు అందజేయాలని కోరారు. వ్యవసాయాధికారి స్పందిస్తూ రైతులకు సమస్యలు లేకుండా చూస్తామన్నారు. గ్రామాల్లో తాగు నీటి పైపు లైన్లు దెబ్బతినడంతో మురుగునీరు తాగునీరు కలుషితమౌతోందన్నారు. వర్షా కాలం ప్రారంభమయ్యే లోపు వాటికి మరమ్మతులు నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని కోరారు. వరిపంటల సాగు సమయంలో పాములు, గ్రామాలలో కుక్కల బెడద ఎక్కువగా వుందన్నారు. బుచ్చి, జొన్నవాడ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పాము, కుక్కకాటుకు వ్యాక్సిన్లు అవసరమైనన్ని అందుబాటులో వుంచాలన్నారు. ఈ సమావేశంలో పలువురు ఎంపీటీసీలు, సర్పంచులతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

గుర్రప్పస్వామికి పూజలు

వింజమూరు : పట్టణంలోని నడిమూరులో ఉన్న గురప్పస్వామి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పాలభిషేకం, ప్రత్యేక పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. సాయంత్రం కోలాట భజనలు ఏర్పాటు చేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఇందుకూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రావూరి డొంక, ఏపీటీడబ్ల్యూఆర్ ఎస్టీ గురుకుల పాఠశాల హాస్టల్‌లో శుక్రవారం పరిసరాల పరిశుభ్రతపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సీహెచ్ సుధాకర్‌రావు, వైద్యాధికారులు డాక్టర్ బ్రహ్మేశ్వరనాయుడు, డాక్టర్ కిషోర్ కుమార్, ప్రిన్సిపాల్ జనార్దన్ రావు మాట్లాడారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులు హాస్టల్ ప్రాంగణంతో పాటు, టాయి లెట్లు, బాత్‌రూంలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అపరిశుభ్రత వల్ల దోమలు, ఈగలు వృద్ధి చెంది, వ్యాధులు ప్రబలుతాయన్నారు. రోజూ స్నానం చేయాలని, జుట్టు, గోర్లు శుభ్రంగా కత్తిరించుకోవాలన్నారు. పళ్లు రోజుకి కనీసం రెండుసార్లు తోమాలని, భోజనానికి ముందు చేతులు కడుక్కోవాల న్నారు. సుజాత హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది లక్ష్మణ్, మహేష్, అధ్యా పకులు, ఆశా వాలంటీర్లు అనూహ్య పాల్గొన్నారు.



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సుధాకర్‌రావు

విధి నిర్వహణలో గుండెపోటుతో

ఆర్టీసీ బస్సు డ్రైవర్ మృతి

- కావలి నుంచి బెంగళూరు వెళ్తుండగా ఘటన
- సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు



షేక్ రసూల్(ఫైల్)

కావలిరూరల్, జూలై 25 (ఆంధ్ర జ్యోతి): విధి నిర్వహణలో గుండె పోటుతో ఆర్టీసీ బస్సుడ్రైవర్ మృతిచెం దిన ఘటన అన్నమయ్య జిల్లా రాయ చోటి పట్టణంలోని మదనపల్లి రోడ్డు సమీపంలో శుక్ర వారం తెల్లవారుజా మున జరిగింది. కావలి ఆర్టీసీ డీఎం దార్ల ఆదినారాయణ తెలిపిన వివరాల మేరకు... కావలి ఆర్టీసీ డిపోకు చెందిన ఏపీ 26 జెడ్ 0275 నెంబరు గల సూపర్ లగ్జరీ బస్ ప్రయాణికులతో గురువారం సాయంత్రం 6.30 గంటలకు కావలి నుంచి బెంగళూరుకు బయలుదేరింది. మార్గ మధ్యంలో తెల్లవారు జామున 3గంటల సమయంలో అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని మదనపల్లిరోడ్డు సమీపంలో బస్సు డ్రైవర్ షేక్ రసూల్(52)కు గుండెపోటు రావడంతో స్టీరింగ్‌పై కుప్పకూలి మృతిచెందాడు. సింగిల్ డ్రైవర్‌గా ఉన్న ఆయన గుండెనొప్పి రగానే బస్సును రోడ్డు మార్జిన్‌లో నిలిపివేశాడు. దీంతో బస్సు ముందు భాగం దెబ్బతిన్నప్పటికీ ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కాగా ఉదయగిరికి చెందిన రసూల్ ఉద్యోగ రీత్యా కుటుంబంతో కలసి కావలి పట్టణంలోని తుఫాన్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సర్వేపల్లి కాలువలో మృతదేహం



గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు(క్రైం), జూలై 25 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు లోని పూలేబొమ్మ సమీపాన సర్వేపల్లి కాలువలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి స్థానిక వీఆర్వోకు సమాచారమిచ్చారు. వీఆర్‌వో సుబ్బలక్ష్మమ్మ మృతదేహాన్ని పరిశీలించి బాలాజీనగర్ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు ఆ మృతదేహాన్ని స్థానికుల సహకారంతో బయటకు తీశారు. 48-50 సంవత్సరాల మధ్య వయస్సు వ్యక్తి మృతిచెందాడు. మృతదేహంపై గులాబీ రంగు చొక్కా, సిమెంట్ రంగు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు బాలాజీనగర్ పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు కోరారు.

మున్సిపల్ వాహనాల

బ్యాటరీ దొంగల అరెస్ట్



నిందితుల వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు

నెల్లూరు(క్రైం), జూలై 25(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని పాత మున్సిపాలిటీ ఆఫీస్ ఆవరణలో నిలిపి ఉన్న మున్సిపల్ వాహనాలకు ఉండే బ్యాటరీలు దొంగిలించిన ఇద్దరు నిందితులను సంతపేట పోలీసులు అరెస్ట్‌చేశారు. వివరాలను సంతపేట స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. పాత మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో నిలిపి ఉన్న చెత్తతోలే 17 ప్రభుత్వ వాహనాలకు ఉండే బ్యాటరీలను గుర్తుతెలియని దుండగులు ఈఏడాది ఫిబ్రవరి 3న దోచుకెళ్లారు. పోలీసులు దర్యాప్తు నగరంలోని ఇసుకడొంక రిక్షా కాలనీకి చెందిన షేక్ షఫీ, అల్లీపురం టిడ్కో ఇళ్లలో ఉండే దాసరి అప్పారావు నిందితులుగా గుర్తించారు. వారిని ఈనెల 24వ తేదీ రాత్రి పుట్టా ఎస్టేట్ వద్ద అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.81 వేల విలువచేసే 17 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు, ఎస్ఐ సుల్తాన్ బాషా, హెడ్‌కానిస్టేబుళ్లు సుబ్బారావు, లావణ్యకుమార్, కానిస్టేబుళ్లు సురేంద్ర, గోపి, అల్లభక్షును ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అభినందించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం



నిందితుడి వివరాలు తెలుపుతున్న రైల్వే డీఎస్పీ మురళీధర్

నెల్లూరు(క్రైం), జూలై 25 (ఆంధ్ర జ్యోతి): నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో ఓవ్యక్తి నుంచి జీఆర్‌పీఎస్, ఆర్‌పీఎఫ్ పోలీసులు ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను రైల్వే డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ మురళీధర్ విలేకరులకు తెలిపారు. టాటానగర్ - ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ నుంచి నెల్లూరు రైల్వే స్టేషన్‌లో దిగిన తమిళనాడు రాష్ట్రం అండిపెట్టి వట్టామ్ ప్రాంతానికి చెందిన వీ మనోజ్‌కుమార్ అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 5 కేజీల గంజాయి ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఎన్ హరిచందన కేసు నమోదు చేశారు. డ్రగ్స్ నివారణ, సహాయం కోసం టోల్‌ఫ్రీ నెంబరు 139, 1972లను సంప్రదించాలని డీఎస్పీ కోరారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

చీటింగ్‌పై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జూలై 25 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న డబ్బు ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తిపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... నెల్లూరులోని కోటమిట్టలో సయ్యద్ సాబీర్ కుటుంబం నివసిస్తోంది. ఆయన హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. గతేడాది అభినవ్ అనే వ్యక్తి ఫోర్డ్ ఎకో స్పోర్ట్స్ కారును సాబీర్ వద్ద కుదువపెట్టి రూ.2.50 లక్షలు నగదు తీసుకున్నాడు. ఈమేరకు పత్రం రాసిచ్చాడు. అయితే కొంతకాలానికి బాడుగ ఉందని వెంటనే తీసుకువచ్చి ఇస్తానని అభినవ్ నమ్మకంగా చెప్పి సాబీర్ నుంచి కారును తీసుకెళ్లాడు. రోజులు గడుస్తున్నా కారును ఇవ్వకపోవడంతో సాబీర్ నిలదీశాడు. కారు ఇవ్వలేనని, తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చేస్తానని చెప్పారు. అయితే ఎన్ని నెలలైనా ఆ నగదు కూడా ఇవ్వకపోగా బెదిరిస్తున్నాడంటూ సాబీర్ శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ వద్ద పెన్నానదిలోని ఇసుక రీచ్ నుంచి గురువారం అర్ధరాత్రి ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. స్థానికుల సమాచారం మేరకు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. పెనుమూరు వద్ద శుక్రవారం రాత్రి ఓ వేస్టేజి వాహనాన్ని స్థానిక టీడీపీ నేతలు పోలీసులకు అప్పగించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264
కోడిగుడ్ల ధర (100)	590

పినాకినీ పార్కును అభివృద్ధి చేయండి : కమిషనర్

నెల్లూరు(సిటీ), జూలై 25,(ఆంధ్రజ్యోతి) : నగరంలో రంగనాయకుల పేటలోని పినాకినీ పార్కును కార్పొరేషన్ కమిషనర్ నందన్ శుక్రవారం పరిశీలించారు. ఆట వస్తువులు, క్రీడా పరికరాలు, వాకింగ్ ట్రాక్, పెయిం టింగ్స్, బెంచీలతో పార్కును అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశిం చారు. అనంతరం కుక్కలగుంట వద్దనున్న వెహికల్ షెడ్డులో చెత్త సేకరణ వాహనాలను పరిశీలించారు. ప్రతీ వాహనాన్ని వినియోగంలోకి తీసుకురా వాలని యంత్రాంగానికి సూచించారు. ఆ తర్వాత కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులతో సమావేశం నిర్వహించి ఆటో ప్రాపర్టీ ట్యాక్స్ మ్యుటేషన్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీసీ చెన్నుడు, సబ్‌రిజిస్ట్రార్లు సుమలత, భానుమతి, ప్రవీణ, సింహాద్రి, రెవెన్యూ అధికా రులు పాల్గొన్నారు.

రేపు శాస్త్రీయ నృత్యపోటీలు

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక సమితి సౌజన్యంతో హరివిల్లు క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఆదివారం శాస్త్రీయ జానపద నృత్యోత్సవం జరుగుతుందని హరివిల్లు క్రియేషన్స్ అధినేత దోర్నాల హరిబాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం సాయంత్రం టౌనుహాలులో జరుగుతుందని, నృత్య ప్రదర్శనల్లో ప్రతిభ కనపరిచిన వారిని అవార్డులతో సత్కరిస్తామని తెలిపారు. అంతర్జాతీయ రికార్డులు సాధించిన వారికి ప్రతిభ పురస్కారాలు అందజేస్తామని పేర్కొన్నారు.

ప్రతీ సమస్యకు నిర్ణీత కాలంలో పరిష్కారం

● టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ పరమైన ప్రతీ సమస్యకు నిర్ణీత కాలంలోపు పరిష్కారం చూపుతామని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని సౌత్‌మోపూరు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఎంపీపీ విజయకుమార్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. రైతులు భూ సమస్యలతో సతమతమవుతున్నారని, వాటికి పరిష్కారం చూపాలన్న ఆలోచనతో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఈ సదస్సులకు శ్రీకారం చుట్టారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీటీ నాజర్, వీఆర్వో శ్రీహరి, నాయకులు చంద్రశేఖర్, అన్నం సుధాకర్, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులు రెడ్డి, జలదంకి సుధాకర్ పాల్గొన్నారు.

వైసీపీకి అశోక్ రెడ్డి రాజీనామా

● త్వరలో టీడీపీలో చేరిక



నెల్లూరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు రూరల్లో వైసీపీ కీలక నేత, దేవరపాళెం సర్పంచ్ వేమిరెడ్డి అశోక్‌రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేశారు. త్వరలో టీడీపీలో చేరనున్నట్లు ఆయన శుక్రవారం ప్రకటించారు. గ్రామంలో ఆయన నివాసం వద్ద మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో, నెల్లూరు రూరల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు నచ్చి వైసీపీని వీడుతున్నట్లు తెలిపారు. రానురాను వైసీపీ మనుగడ కష్టమైపోతోందని, అందులో ఇమడలేని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు.

కలుగోళ్ల శాంభవి ఆలయంలో చీరల వేలం

కావలి, జూలై 25(ఆంధ్రజ్యోతి): కావలి గ్రామదేవత కలుగోళ్ల శాంభవికి అలంకరించిన చీరలు శుక్రవారం ఆలయ ఆవరణలో వేలం వేశారు. ఈ వేలంలో 36 చీరలను రూ23,600లకు భక్తులు వేలంలో దక్కించుకున్నారు. దేవస్థానం ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో కోవూరు గ్రూపు ఆలయాల ఈవో సీహెచ్ కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో వేలంపాట నిర్వహించారు. ఇక నుంచి ప్రతి నెలా 4వ శుక్రవారం అమ్మవారికి అలంకరించిన చీరలు వేలం వేస్తామని ఈవో రాధాకృష్ణ తెలిపారు.

సుభానీ మనీస్కాం సూత్ర, పాత్రధారి

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డే!

● తెలుగు తమ్ముళ్ల ధ్వజం

కావలి, జూలై 25(ఆంధ్రజ్యోతి) : కావలిలో సంచలనం కలిగించిన సుభానీ మనీ స్కాంలో సూత్రధారి, పాత్రధారి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డేనని టీడీపీ నేతలు ఆరోపించారు. బెంగళూరు నుంచి సుభానీని కావలికి తీసుకువచ్చి ఆయనకు ఆశ్రయం కల్పించి అన్నీ తానై చూసుకుంటూ ప్రతినెలా ఆయన నుంచి ముడుపులు తీసుకుంటూ మనీ స్కాంకు సహకరించారని, అందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయన్నారు. కావలి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్‌బాబు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, జ్యోతి బాబూరావు, పోతుగంటి అలేఖ్య, కండ్లగుంట మధుబాబు నాయుడు, పోట్లూరి శ్రీనివాసులు, దేవరకొండ శ్రీనివాసులు, పద్మావతి శ్రీదేవి, తిరువీధి ప్రసాద్, దావులూరి దేవకుమార్, బాలగురుస్వామి, జనసేన నాయకుడు సిద్దూ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో సంచలనం కలిగిస్తున్న మద్యం స్కాంలో కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పేరు వస్తుండటంతో దానిని పక్కదారి పట్టించేందుకు ఆయన సుభానీ మనీ స్కాంలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి ముడుపులు ముట్టాయని ఆరోపణలు చేస్తున్నారన్నారు. మనీ స్కాంలో సూత్రధారులంతా వైసీపీకి చెందిన వారేనన్నారు. 2021లో ఆ స్కాంకు కావలిలో ఆశ్రయం కల్పించి అప్పటి నుంచి తద్వారా లబ్ధిపొందుతూ ఉండగా స్కాం బాధితులు టీడీపీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన పోలీసుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. దీంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారన్నారు. అయితే ప్రతాప్‌రెడి మద్యం స్కాంలో ఇరుక్కోవడంతో ఆయనను పోలీసులు ఏక్షణంలోనైనా అరెస్ట్ చేసే అవకాశం ఉందన్నారు.

వామ్మో..!





విడివిడిగా పడిఉన్న బొమ్మ భాగాలు



బొమ్మలు భయపెడుతున్నాయ్..!

నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్ తూర్పు వైపు సర్వేపల్లి కాలువ వద్ద రాత్రి పూట కొన్ని బొమ్మలు ప్రజలను భయపెడుతున్నాయి. మనిషి ఆకారంలో ఉన్న బొమ్మల కాళ్లు, చేతులు, మొండెం, తల వంటివి ఆ ప్రాంతంలో విడివిగా పడి ఉన్నాయి. వెంకటేశ్వరపురం వైపు నుంచి రైల్వే స్టేషన్ వైపు వచ్చే ప్రజలు రాత్రి పూట చీకటిలో సర్వేపల్లి కాలువ కట్టపై ఆ బొమ్మల భాగాలను చూసి ఎవరో మనిషిని ముక్కలుగా నరికి పడేసినట్లుగా భావించి భయాందో ళన చెందుతున్నారు. కొందరు ధైర్యం చేసి దగ్గరగా వెళ్లి వాహనాల లైట్లు వేసి చూసి నవ్వుకుంటూ వెళ్లిపోతున్నారు. అసలు విషయం ఏమిటంటే బట్టల దుకాణాల్లో డిస్‌ప్లే కోసం పెట్టే బొమ్మల విడిభాగాలను ఎవరో సర్వేపల్లి కాలువ కట్టపై పడేశారు. వాటిని చూసి ప్రజలు భయపడుతున్నారు. - నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)

ఆలయాల్లో శ్రావణ శోభ

● ఉత్సవాలు, సామూహిక పూజలు
● భక్తులతో అమ్మవారి గుళ్లు కిటకిట

నెల్లూరు (సాంస్కృతికం), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం సందర్భంగా నగరంలోని పలు ఆలయాల్లో విశేష పూజలు మొదల య్యాయి. శుక్రవారం కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఉదయం అభిషేకాలు, అనంతరం ప్రత్యేక పూజలు జరిగాయి. వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన, సాయంత్రం పూలంగిసేవ, మూలవర్లకు కుంకుమ అలంకారం జరిగాయి. 108 మంది మహిళలకు సౌభాగ్య ద్రవ్యాలు అందజేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్య నిర్వాహక అధ్యక్షుడు మేగ షణ్ముఖరావు, కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌రావు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● నెల్లూరు గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో మూలవర్లకు చందనాలంకారం, పూలంగిసేవ, పల్లకీ ఉత్సవం జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. రాహుకాల దీపాలు వెలిగించి, సామూహిక పూజల్లో పాల్గొన్నారు.

● వేదగిరి క్షేత్రంలో...

నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి) : శ్రావణ శుక్రవారం సందర్భంగా వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ఆదిలక్ష్మి అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు జరిగాయి. నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణతో పల్లకిపై గిరి ప్రదక్షణ నిర్వహించారు.



వేదగిరిపై ఆదిలక్ష్మి అమ్మవారు



విశేష అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో రాహుకాల దీపాలు వెలిగిస్తున్న మహిళలు

గౌడ విద్యార్థులకు రేపు ప్రతిభా పురస్కారాలు

నెల్లూరు (హరనాథపురం), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పదో తరగతిలో ప్రతిభ చాటిన గౌడ కుల విద్యార్థులకు ఆదివారం ప్రతిభ పురస్కారాలు అందజేస్తామని జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం అధ్యక్షుడు తోట ప్రభాకర్‌గౌడ్ చెప్పారు. నగరంలోని ఆ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోసూరు గోవిందయ్య గౌడ్ ఆశయ సాధనలో భాగంగా పదో తరగతిలో 450కు పైబడి మార్కులు సాధించిన 191 మంది విద్యార్థులకు పురస్కారాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టౌన్‌హాల్‌లో జరుగుతుందని తెలిపారు.

జడ్పీ విద్యార్థులకు ఆర్థిక చేయూత



ఆర్థిక ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులు

నెల్లూరు(విద్య), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని దర్గామిట్ట జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో చదివి పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక ప్రోత్సాహకాలను అందచేశారు. 500లకుపైగా మార్కులు తెచ్చుకున్న 15 మందికి రూ.5వేలు చొప్పున మొత్తం రూ.75వేలు నగదుద అందజేశారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్‌లో తరగతుల్లో మరిం త ఉత్తమంగా రాణించాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు జీ సురేంద్రబాబు, చైర్మన్ నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థి, ప్రముఖ గుండె వ్యాధి నిపుణుడు డాక్టర్ భక్తవత్సలరెడ్డి, కంటి వైద్య నిపుణుడు డాక్టర్ జీ కిరణ్ కుమార్‌రెడ్డి, డాక్టర్ యుగంధర్, ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కృత్రిమ గర్భధారణపై అవగాహన అవసరం

● డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత ● ఐవీఎఫ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ



ఐవీఎఫ్ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత

నెల్లూరు (వైద్యం), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) విధానంలో కృత్రియ గర్భధారణ ఎలా చేస్తారనే దానిపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత అన్నారు. ప్రపంచ ఐవీఎఫ్ డే సందర్భంగా నగరంలోని కృత్రిమ గర్భధారణ కేంద్రాలను శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిద్ధార్థ నర్సింగ్ హోమ్, కవితా కిరణ్ ఆసుపత్రుల్లో ఐవీఎఫ్, ఏఆర్‌టీ స్పెర్మ్ బ్యాంకులు అందిస్తున్న వైద్య సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎన్నో కుటుంబాలు ఏళ్ల తరబడి పిల్లలు కలుగక ఇబ్బంది పడుతున్నాయని, ఇలాంటి వారికి ఐవీఎఫ్ ద్వారా గర్భధారణకు అవకాశం ఉంటుందన్నారు. ఆలస్య వివాహాలు, ఫాస్ట్.. జంక్ ఫుడ్, హార్మోన్ల అసమతుల్యత, మేనరికాలు వంటి కారణాలతో ఎక్కువ మంది పిల్లలు పుట్టే అవకాశాన్ని కోల్పోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఐవో డాక్టర్ ఉమామహేశ్వరి, డెమో కనక రత్నం, డిప్యూటీ హెచ్‌ఈవో అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇండోసోల్ ఉత్తర్వులు రద్దు చేయాలి

● డీఆర్వోకు సీపీఎం వినతి



డీఆర్వోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నెల్లూరు (వైద్యం), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఉలవపాడు మండలం కరేడు గ్రామంలో ఇండోసోల్ కంపెనీకి జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి హుస్సేన్ సాహెబ్‌కు వినతిపత్రం ఇచ్చారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ కరేడు గ్రామంలో 8348 ఎకరాల రైతుల భూములను ఇండోసోల్ కంపెనీ కోసం సేకరణకు ప్రభుత్వం జూన్ 21న నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. అయితే జూలై 4వ తేదీన జరిగిన గ్రామ సభలో భూములు ఇచ్చేందుకు రైతులు సుముఖత వ్యక్తం చేయలేదన్నారు. 18 వేల మంది జనాభా ఉన్న ఈ గ్రామంలో 85 శాతం చిన్న, సన్నకారు రైతులేనని వెల్లడించారు. ఈ నేపథ్యంలో మరో విడత గ్రామసభలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వటం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నగర మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్షయ బాధితులను ఆసుపత్రులకు పంపండి

● జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి



వైద్యులతో మాట్లాడుతున్న క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి

నెల్లూరు (వైద్యం), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ ఆసుపత్రిలో క్షయ అని నిర్ధారణ అయిన వ్యాధిగ్రస్తుని ప్రభుత్వ టీబీ ఆసుపత్రికి సిఫార్సు చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి సూచించారు. శుక్రవారం నగరంలోని అమృత చెస్ట్ ఆసుపత్రి, జీకే ఆసుపత్రి, జైచంద్ర ఆసుపత్రిని ఆయన సందర్శించారు. అక్కడ వైద్యులను క్షయ వ్యాధిగ్రస్తులపై విచారించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరు నెలలు ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. అంతే కాకుండా పౌష్టికాహారం కోసం రూ.ఆరువేల అందిస్తారని చెప్పారు. ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో ప్రతి ఒక్క ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాహకులు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా పబ్లిక్, ప్రైవేట్ మిక్స్ కో ఆర్డినేటర్ హరీష్ భవ్య, కో ఆర్డినేటర్ తలసీరామ్, ఫీల్డ్ కో ఆర్డినేటర్ సరిత, అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆశలు, ఆకాంక్షలకు

అనుగుణంగా పాలన

● రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పార్థసారథి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

నెల్లూరురూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా చంద్రబాబు ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొటిగా నెరవేర్చుకుంటూ వెళ్తున్నాము కాబట్టే ప్రజల ముందుకు ధైర్యంగా వెళ్లగలుగుతున్నా మని చెప్పారు. శుక్రవారం నెల్లూరు రూరల్లోని 17వ డివిజన్ వడ్డిపాళెం వద్ద రూ.85 లక్షల విలువ చేసే అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ప్రజలకు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలను చిత్తశుద్ధితో ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్లు పెట్టుబడులు రాబోతున్నాయని మంత్రి తెలిపారు. ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో నెల్లూరు రూరల్లో ఏకంగా రూ.268 కోట్లతో అభివృద్ధి పనులు జరగడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, జెన్ని రమణయ్య, సాభీర్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు గదుల్లో ఇక్కట్లు

● గదులు 4... విద్యార్థులు 320 మంది
● ఉదయగిరి జూనియర్ కళాశాల దుస్థితి

పాలకులు, అధికారులు పట్టించుకోవాలి

ఉదయగిరి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అల్లూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు తగ్గట్టుగా తరగతి గదులు లేకపోవడంతో అధ్యాపకులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కళాశాలలో నాలుగు తరగతి గదులున్నాయి. మరో నాలుగు శిథిలావస్థకు చేరి కూలే దశలో ఉన్న సమీపంలోని ఉన్నత పాఠశాలకు చెందిన ప్రాక్టికల్స్, సామగ్రి నిల్వచేసే గదుల్లో అవస్థలు పడుతూ తరగతులు నిర్వహిస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో ఆరుబయట ఎండలో పరీక్షలు, తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న భోజన సమయంలో సైతం విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. గత ప్రభుత్వ హయాంలో కళాశాలకు నాడు-నేడు పథకం కింద అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయకుండా మరమ్మతులకు మంజూరు చేశారు. అయితే కళాశాలలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడం, తరగతి గదులు లేకపోవడం, ఇరుకుగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధ్యాపకులు, విద్యార్థులు వాపోతున్నారు. చుట్టుపక్కల మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎక్కడా లేదు. దీంతో పేద విద్యార్థులంతా ఈ కళాశాలలోనే చేరుతారు. రాష్ట్ర ప్రభుత్వమైనా స్పందించి అదనపు తరగతి గదులకు నిధులు మంజూరుచేసి తమ కష్టాలు తీర్చాలని అధ్యాపకులు, విద్యార్థులు కోరుతున్నారు.

కలుజులపై వంతెనలు నిర్మించండి



పొట్టేపాళెం వద్ద సీపీఎం నాయకుల ఆందోళన

నెల్లూరురూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : పొట్టేపాళెం, ములుముడి కలుజులపై వెంటనే వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు శుక్రవారం పొట్టేపాళెం కలుజు వద్ద ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆ కలుజులపై చెరువు నీళ్లు వేగంగా ప్రవహిస్తుండటంతో వాటిపై ప్రయాణం ప్రమాదకరంగా మారిందన్నారు. ఏళ్ల తరబడి వేధిస్తున్న ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి ఈ అంశాన్ని గతంలో అనేక దఫాలుగా అసెంబ్లీ వేదికగా ప్రస్తావనకు తీసుకువచ్చినా ఫలితం లేకుండాపోయిందని వాపోయారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పొట్టేపాళెం చంద్రమౌళి, మండల కార్యదర్శి పూడిపర్తి జనార్దన్, నాయకులు ఆలూరు తిరుపాలు, గండవరం శ్రీనివాసులు, ముత్యాల నాగయ్య పాల్గొన్నారు.

వారి త్యాగం.. మనకు ఫలం


- నేడు కార్గిల్ విజయోత్సవ దినం
- నాటి యుద్ధంలో జిల్లా వారు 22 మంది
- నగరంలో విజయోత్సవ ర్యాలీ.. పోరాటయోధులకు నేడు సత్కారం

నా దేశ భూభాగంలో ఇంచు కూడా తాకనివ్వను అనేంత తెగువ. శత్రు దేశ సైనికులను సరిహద్దులు దాటించే వరకూ పోరాడిన ధైర్యం. భరతమాత మాత కోసం ప్రాణాలైనా అర్పించేంత భక్తి.. నాడు దేశ సైనికుల వీరోచిత పోరాట ఫలితం కార్గిల్ యుద్ధంలో చారిత్రాత్మకమైన విజయం. అత్యంత క్లిష్ట సమయంలో పాకిస్థాన్ సైనికులను ఆక్రమిత భారత భూభాగం నుంచి తరిమికొట్టిన దినం. ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఈ గొప్ప విజయానికి నేటికి 26 ఏళ్లు. ఈ శుభసందర్భాన్ని పురస్కరించుకొని విజయోత్సవాలు జరుపుకునేందుకు యావత్తు దేశం సిద్ధమైంది. నాటి కార్గిల్ యుద్ధం విజయంలో జిల్లా నుంచి కూడా 22 మంది సైనికులు పాలుపంచుకున్నారు. వివిధ హోదాల్లో నాడు వీరోచితంగా పోరాడారు. నాటి పరిస్థితులు, అప్పటి విజయాన్ని గుర్తు చేసుకుంటూ నేడు పులకరించిపోతున్నారు. వీరిని నేడు కలెక్టర్ ఓ ఆనంద్ అధ్యర్యంలో నెల్లూరులోని తిక్కన ప్రాంగణంలో సన్మానించనున్నారు. వీఆర్సీ నుంచి కలెక్టరేట్ వరకూ సైనిక సంక్షేమ శాఖ అధ్వర్యంలో ఉదయం పది గంటలకు కార్గిల్ విజయోత్సవ ర్యాలీ జరగనుంది.

'కార్గిల్'లో గెలిచినా వారికి దక్కని న్యాయం • కొన్నేళ్లుగా భూ పంపిణీలో అలసత్వం • ఇప్పుడిప్పుడే కదులుతున్న ఫైళ్లు

దేశ రక్షణ కోసం త్రివిధ దళాల్లో జిల్లా నుంచి వేల మంది పనిచేశారు. ఇంకా చాలా మంది పనిచేస్తున్నారు. వారిలో ప్రస్తుతం 1900 మంది వరకూ మాజీ సైనికులు జీవించి ఉన్నారు. వీరంతా పెన్షన్లు తీసుకుంటున్నారు. అలానే మరో 1100 మంది మాజీ సైనికుల సతీమణులకు పింఛన్లు అందుతున్నాయి. వీరందరి సంక్షేమాన్ని పర్యవేక్షించేందుకు జిల్లాలో సైనిక సంక్షేమ కార్యాలయం ఉంది. చట్ట ప్రకారం సైనికోద్యోగం నుంచి పదవీ విరమణ పొందాక ఆ మాజీ సైనికులకు జీవనోపాధి కోసం రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ భూములను పంపిణీ చేస్తుంటాయి. ఒక్కొక్కరికి గరిష్ఠంగా ఐదెకరాల వరకూ అందిస్తుంటారు. జిల్లాలో వేల మందికి ఇలా భూములు ఇచ్చారు. అయితే కొన్నేళ్లుగా ఈ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మాజీ సైనికుల పట్ల రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ విషయంలో ప్రభుత్వాలు కూడా పెద్దగా పట్టించుకోకపోవడంతో పోరాటవీరులకు సకాలంలో న్యాయం జరగడం లేదు. జిల్లాలో సుమారు 90 మంది మాజీ సైనికులకు భూములు ఇవ్వాల్సి ఉంది. వీరంతా ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఉన్నారు. అయితే దేశ సరిహద్దుల్లో శత్రువులతో పోరాడినంతగా దేశంలోపలి వ్యవస్థలతో పోరాడలేక వారంతా అలసిపోతున్నారు. మెట్టెం వెంకటేశ్వర్లు అనే ఓ మాజీ సైనికుడు 20 ఏళ్ల పాటు భూమి ఇవ్వండి అంటూ అధికారుల చుట్టూ తిరిగి చివరకు ఆ భూమి పొందకుండానే అసువులు బాసారు. యల్లల కృష్ణయ్య అనే మరో మాజీ సైనికుడికి నెల్లూరు రూరల్‌లోని నవలాకులతోటలో భూమి ఇవ్వగా దానిని మరొకరు ఆక్రమించారు. తన భూమి తనకు ఇప్పించండంటూ కొన్నేళ్లపాటు అధికారుల చుట్టూ తిరిగి చివరకు తనువు చాలించారు. ఇటువంటి పరిస్థితిని అనేక మంది మాజీ సైనికులు అనుభవిస్తున్నారు. అయితే ఇటీవల కలెక్టర్ ఆనంద్ చొరవతో మాజీ సైనికులకు భూములు ఇచ్చే ప్రక్రియలో అడుగులు ముందుకు పడ్డాయి. జిల్లా సైనిక సంక్షేమ అధికారి జీ హరికృష్ణ నిరంతరం పర్యవేక్షిస్తుండటంతో ఇప్పటికే పది మందికి అడ్వాన్స్‌డ్ పొజిషన్ కూడా ఇచ్చారు. విజయోత్సవ సంబరాల్లో భాగంగా శనివారం మరో ఇద్దరు మాజీ సైనికులకు కూడా పట్టాలు అందించనున్నారు. మిగిలిన వారికి కూడా త్వరగా భూ పట్టాలు అందిస్తే ఆయా కుటుంబాలకు న్యాయం జరుగుతుంది. అదే సమయంలో నెల్లూరులో సైనిక అమరవీరుల స్థూపం నిర్మించాలని ఎప్పటి నుంచో మాజీ సైనికులు కోరుతున్నారు. దీనిపై కూడా కలెక్టర్ సానుకూల నిర్ణయం తీసుకోవాలని వారు ఆశిస్తున్నారు.

- నెల్లూరు, (ఆంధ్రజ్యోతి)





ఎన్నో భయానక దృశ్యాలు చూశా

కార్గిల్ యుద్ధం జరిగే సమయంలో నేను శ్రీనగర్ బార్డర్ వద్ద యుద్ధంలో పాల్గొన్నాను. శ్రీనగర్ నుంచే అనేక యుద్ధ విమానాలు నిత్యం యుద్ధంలో పాల్గొనేవి. నేనే శ్రీనగర్‌లోని అడ్మిన్ కంట్రోల్ సెంటర్‌కు వింగ్ కమాండ్ అధికారిగా ఉన్నా. సైనికులకు భోజనం, దుస్తులు, ఆయుధాలు, యుద్ధానికి విమానాల ఏర్పాటు ఇలా అన్ని ఏర్పాట్లు చూస్తూ ఉండేవాడిని. 1999, మే నెల నుంచి జూలై వరకు జరిగిన కార్గిల్ యుద్ధం ఎంతో భయంకరమైనది. 24 గంటలూ యుద్ధం చేయాలి. రోడ్లపైనే నిద్ర పోయేవాళ్లం. విమానాల్లో సైనికుల శవాలు వస్తుంటే వాటిని దింపి, అదే విమానాల్లో తిరిగి వెళ్లి పాకిస్తాన్‌తో పోరాడారు. బాంబులు పడుతుంటే బంకర్‌లోకి పరుగులు తీసేవాళ్లం. ఇలా దేశం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కార్గిల్ యుద్ధం చేసి విజయం సాధించాము. కార్గిల్ యుద్ధంలో నేను చేసిన సేవలకు భారతప్రభుత్వం కార్గిల్ వార్‌స్టార్ అనే బిరుదును అందజేసింది.

- వల్లూరు శ్యామ్‌ప్రసాద్, వింగ్ కమాండర్



రాడార్ సిస్టంలో పనిచేశా..

కార్గిల్ యుద్ధం సమయంలో చండీఘర్ బేస్‌లో పనిచేశా. శ్రీనగర్, ఉదయ్‌పూర్, జమ్మూ ప్రాంతాల్లో యుద్ధం జరుగుతున్న సమయంలో యుద్ధ విమానాలతోపాటు సిపాయిల హెల్మెట్లలో జీపీఎస్ సిస్టం ఉండేది. ఎక్కడ ఉన్నా రాడార్ సిస్టం ద్వారా తెలుసుకునే వాళ్లం. ఈ సిస్టం అమెరికా, రష్యా వంటి అగ్ర రాజ్యాలకే పరిమితం. అప్పట్లో మనకు ఈ టెక్నాలజీలో ఇజ్రాయిల్ దేశం బాగా సహాయ సహకారాలు ఇచ్చింది. దాదాపు 200 కి.మీ దూరంలో ఉన్నా ఈ సిస్టం ద్వారా ఎక్కడ ఉన్నారో తెలిసిపోతుంది. శత్రుదేశం విమానాల్లోంచి కొన్ని మెటాలిక్ చిప్స్‌లను వదిలేసేవి. వాటిని కూడా విమానాలుగా రాడార్ గుర్తిస్తుంది. దీంతో యుద్ధ విమానాలు ఎక్కువగా వస్తున్నా యం టూ తప్పుదోవ పట్టించే వారు. వాటిని గుర్తించే విభాగమైన రాడార్ సిస్టంలో నేనుకూడా పని చేశా. సముద్ర మట్టానికి 5 నుంచి 6వేల మీటర్ల ఎత్తులో యుద్ధం జరిగింది. అప్పటి ప్రధాని వాజ్‌పేయి ప్రభుత్వం ఎంతో సహకారం ఇచ్చింది. చని పోయిన జవాన్లను వారి సొంత ఊళ్లకు పంపించేవారు. 20 ఏళ్లు సేవలందించి 2002లో పదవీవిరమణ చేశాను. ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక వంటి ప్రాంతాల్లో జవాన్లను పెద్దగా పట్టించుకోరు. పంజాబ్, హర్యానా ప్రాంతా ల్లో దేవుడిలా చూస్తారు. ప్రభుత్వాలు హామీలు ఇవ్వడం తప్ప పెద్దగా ప్రోత్సాహకాలు లేవు. 2003లో టూరిజంలో ఉద్యోగంలో చేరా.

- కేవీ.సుబ్బా రెడ్డి, సర్జంట్, ఎయిర్‌ఫోర్స్ రేడియో ఫిట్టర్



మా వాహనాలపై బాంబులు వేశారు

ఇండియన్ ఆర్మీలో సప్లైలో డ్రైవర్‌గా 26ఏళ్లపాటు సర్వీస్ చేశాను. కార్గిల్ యుద్ధ సమయంలో మా వాహనాల మీద బాంబులు వర్షం కురిసింది. పాకిస్థాన్ వైపు నుంచి గ్రానైడ్ మా పక్క వాహనం మీద పడింది. అందులో నా సహచరుడు శ్రీనివాసు ప్రాణాలు విడిచాడు. కొంతమంది గాయపడ్డారు కూడా. అది చాలా బాధగా ఉన్నా ఈ ఘటన మాలో కసిని పెంచింది. ఆఖరికి శత్రువులపై విజయం సాధించాం.

- కళాధర్, ఆర్మీ విశ్రాంత డ్రైవర్



టైగర్ హిల్స్ దగ్గర బాంబుల వర్షం

ఆర్మీలో నేను సిగ్నల్స్ విభాగంలో ఆపరేటర్‌గా 17 సంవత్సరాల పాటు సర్వీస్ చేశాను. కార్గిల్ యుద్ధంలో టైగర్ హిల్ దగ్గర బాంబుల వర్షం కురిసింది. అందులో నా సహచరులు ఇద్దరు చనిపోయారు. కొంతమంది గాయపడ్డారు. అది చాలా బాధగా ఉన్నా అది మాలో కసిని పెంచింది.

- రవికుమార్, ఇండియాన్ ఆర్మీలో విశ్రాంత సిగ్నల్స్ ఆపరేటర్



యుద్ధంలో ధైర్యంగా పని చేశా

ఆర్మీ (సిగ్నల్స్)లో ఆపరేటర్‌గా చేశారు. 17 సంవత్సరాలు సర్వీస్ చేసి 2000లో పదవీ విరమణ చేశాను. 1999 కార్గిల్ యుద్ధ సమయంలో ఉదంపూర్ సెక్టార్‌లో 21 జేఏటీ రెజిమెంట్లో కమ్యూనికేషన్ ఆపరేటర్‌గా పని చేశాను. యుద్ధ సయయంలో ఎలాంటి భయం లేకుండా పాల్గొన్నా.

- మేదేపల్లి రత్నయ్య, ఆర్మీలో విశ్రాంత కమ్యూనికేషన్ ఆపరేటర్

మా సమస్యలు పరిష్కరించండి!

- బీపీసీఎల్ అధికారుల తీరుపై వెంకటాచలంలో ట్రాన్స్‌పోర్టర్ల నిరసన

వెంకటాచలం, జూలై 25 (ఆంధ్ర జ్యోతి) : జిల్లా ఉన్నతాధికారులు సత్వ రమే స్పందించి నష్టాల ఊబి నుంచి తమను కాపాడాలని బీపీసీఎల్ (భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) ట్రాన్స్‌పోర్టర్లు కోరారు. పుంజులూరుపాడు రైల్వే గేటు సమీపంలో భారత్ పెట్రోల్ బంకు వద్ద శుక్రవారం కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై ట్రాన్స్‌పోర్టర్లు తమ ఆయిల్ ట్యాంకర్లను నిలిపి నిరసన వ్యక్తం చేశారు. తెలిపారు. బీపీసీఎల్ అధికారులు తమను తీవ్ర వేధింపులకు గురి చేస్తున్నట్లు ట్యాంకర్ల డ్రైవర్లు, హెల్పర్లతో కలిసి ట్రాన్స్‌పోర్టర్లు వాపోయారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ కృష్ణపట్నం పోర్టుకు అనుబం ధంగా ఉన్న బీపీసీఎల్ కంపెనీ డిపో నుంచి భారత్ పెట్రోల్ బంకులకు తరలించేందుకు టెండర్ల ద్వారా బీపీసీఎల్ కంపెనీకి ఆయిల్ ట్యాంకర్లను ఏర్పాటు చేశామన్నారు. బీపీసీఎల్ కంపెనీ ఇక్కడ ప్రారంభించిన నాటి నుండి తాము తక్కువ ధరలకే ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని భారత్ పెట్రోల్ బంకులకు ఆయిల్ రవాణా చేస్తున్నామన్నారు. నాటి పరిస్థితుల దృష్ట్యా తక్కువ ధరలకే టెండర్లు వేశామన్నారు. ఆరు నెలలలోపు పోర్టులో బొగ్గులారీలు తిరిగే రోడ్లపై కాకుండా ప్రత్యామ్నాయ రోడ్డు, గిట్టుబాటు బాడుగలు మొదలైన సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే ఇంతవరకూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోర్టులోని జీరో పాయింట్ వద్ద దాదాపు మూడుగంటలకుపైగా ట్యాంకర్లు వేచి ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. స్థానికంగా బీపీసీఎల్‌లో పని చేస్తున్న అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని, తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. బొగ్గు, ధూళి, పాడైన రోడ్లు, అత్యంత తక్కువ రవాణా ధరల కారణంగా తాము ఇప్పటికే తీవ్ర నష్టాల్లో కూరుకుపోయామన్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో వెంటనే పరిశీలించి తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. నిరసన కార్యక్రమంలో గణేష్ లెమన్ ట్రేడర్స్ అధినేత మస్తాన్ నాయుడు, ట్రాన్స్‌పోర్టర్లు లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్ ట్యాంకర్లతో నిరసన తెలుపుతున్న బీపీసీఎల్ ట్రాన్స్‌పోర్టర్లు

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై పరిశీలన

అల్లూరు, (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాల అమలుపై కేంద్ర బృందం శుక్రవారం పరిశీలన చేపట్టింది. మండలంలోని తూర్పుగోగులపల్లిలో పర్య టించి లబ్ధిదారులను కేంద్ర ప్రభుత్వా పథ కాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పింఛన్లు, జాతీయ ఉపాధి హామీ తదితర అనేక ప్రభుత్వ పథకాల అమలు ఏ విధంగా జరుగుతుందో తెలుసుకునేందుకు తాము వచ్చామని, ఇందు లో ఏవైనా తేడాలు, సమస్యలు, పథకాలు లబ్ధిదారుడికి చేకూర్చేందుకు ఇంకా సులువైన మార్గాలు ఉన్నాయా అనే అంశాలను తెలుసుకుంటున్నామన్నారు. లబ్ధిదారులను నేరుగా కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ డెవలప్‌మెంట్ బృందం సభ్యుడు డాక్టర్ ప్రశాంత్‌కుమార్, స్థానిక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల పదవులు భర్తీ చేయాలి

- ఐఏఎల్ ఆందోళన

నెల్లూరు (లీగల్), (ఆంధ్రజ్యోతి) : దేశంలో న్యాయమూర్తుల పదవులను వెంటనే భర్తీ చేయాలని, న్యాయవాదుల డెత్ బెనిఫిట్స్‌ను వెం టనే విడుదల చేయాలని ఇండియన్ అసోసి యేషన్ అఫ్ లాయర్స్ అధ్వర్యంలో శుక్రవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులు నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్ రెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ అరిగెల నాగేంద్ర సాయి, ప్రధాన కార్యదర్శి ఎం బ్రహ్మం మాట్లా డుతూ న్యాయవాదులకు ప్రస్తుతం ఇస్తున్న వెల్ఫేర్ ఫండ్‌ను రూ.ఆరు లక్షల నుంచి పది లక్షలకు పెంచాలని, న్యాయవాద కుటుంబాలకు రావలసిన డెత్ బెనిఫిట్స్ వెంటనే రిలీజ్ చేయాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలులోకి తేవాలని ప్రభుత్వాన్ని కోరారు.

మున్సిపల్ కార్మికుల పనులు ప్రైవేట్‌కు అప్పగించొద్దు


- రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర రాజగోపాల్



సమావేశంలో మాట్లాడుతున్న చంద్ర రాజగోపాల్

నెల్లూరు (వైద్యం), జూలై 25 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికుల పను లను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు అప్పగించే విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చంద్ర రాజగోపాల్ డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీ4 పేరుతో పేదలను ధనవంతులను చేస్తా మంటున్న రాష్ట్ర ప్రభుత్వం దళిత, గిరిజనులు ఎక్కువగా ఉండే పారిశుధ్య కార్మికులపై చిన్న చూపు చూస్తోందని విమర్శించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకమరాజు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు చేసే పోరాటంలో ప్రజలను భాగ స్వాములను చేస్తామని చెప్పారు. ప్రభుత్వం బేషజాలకు పోకుండా కార్మికుల న్యాయమైన కోర్కెలను నెరవేర్చాలని కోరారు. ఈ సమా వేశంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శివకు మారి, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ, అవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెల్లించకుండానే రోడ్డు నిర్మిస్తున్నారని రైతు నిరసన



నిరసన తెలుపుతున్న రైతు కుటుంబం

సీతారామపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తనకు పరి హారం చెల్లించకుండానే రోడ్డు నిర్మిస్తున్నారని గుండుపల్లి గ్రామానికి చెందిన రైతు మామిడి భాస్కర్ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వేనెంబర్ 93.3లో తనకు 64 సెంట్లు వారసత్వ భూమి ఉండగా దానిలో 50 సెంట్లు హైవే రోడ్డు నిర్మాణానికి పోతుందన్నారు. అధికార యంత్రాంగం నిర్లక్ష్య వైఖరి కారణంగా అందరితో పాటు తాను నష్టపరిహారం పొందలేక పోయానన్నారు. పరిహారం అందివ్వకుండానే పోలీసు బలగాలను దింపి నేషనల్ హైవే పనులను చేపట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా, ఈ విషయంపై తహసీల్దార్, కాంట్రాక్టర్లను వివరణ కోరగా... హైవే రోడ్డుకు పోయిన భూమికి సంబంధించి నష్టపరిహారం అందరితోపాటు అతనికి కూడా చెల్లించేలా చర్యలు చేపట్టామని, ఈలోగా అతని దాయాదులు ఆక్షేపణలు తెలిపి కోర్టును ఆశ్రయించడంతో నష్టపరిహారం చెల్లించేందుకు అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉండటంతో పరిష్కారం లభించేంత వరకు తాము వేచి ఉండలేమని, అందుకే ఉన్నతాధికారుల ఆదేశాలతో రోడ్డు నిర్మాణ పనులు చేయించడం జరిగిందన్నారు.

చేప పిల్లల నర్సరీపై ముగిసిన శిక్షణ

నెల్లూరు(వ్యవసాయం), జూలై 25(ఆంధ్రజ్యోతి): చేప పిల్లల నర్సరీ నిర్వహణ, చెరువుల్లో మేత సంకలితాల ప్రాముఖ్యతపై నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో ఐదు రోజులుగా జరుగుతున్న శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా రైతులతో చర్చాగోష్ఠి నిర్వహిం చారు. వారు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు హరిసాధు, ఎస్ లోకేష్‌బాబు, సూరజ్ మండల్ సమాధానమిచ్చారు. రైతులంతా గ్రూపులుగా ఏర్పడి సమస్యలను కలసికట్టుగా పరిష్కరించుకోవాలని సూచించారు. జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ) సౌజన్యంతో జరిగిన ఈకార్యక్రమంలో ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాల ముఖ్య కార్యనిర్వాహక అధికారి డాక్టర్ యోగ నరసింహ నాయుడు కూడా పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), జూలై 25 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలో 2025-2027 సంవత్సరాలకు జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) కార్యదర్శి నియామకానికి సంబంధించి అర్హులైన పీడీ, పీఈటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో బాలాజీరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన వారు ఈనెల 31వతేదీలోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అవసరమైన ధ్రువపత్రాలతో పాటు సుముఖత లేఖను సమర్పించాలని కోరారు. ఎస్‌జీఎఫ్‌కు సంబంధించిన పూర్తి విధివిధానాలు deonellore50webs.com వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ప్రజల ఆశీర్వాదమే కొలమానం

- గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథి

ఉలవపాడు/వింజమూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యంలో ప్రజల ఆశీర్వాదమే ఏ ప్రభుత్వానికైనా కొలమానమని, అంతేకానీ రపా.. రపా నరుకుతాం, మా ప్రభుత్వం వస్తే ఒక్కొక్కరి అంతుచూస్తామంటే ప్రజలు అంతకుఅంత చెల్లిస్తారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం నెల్లూరు రూరల్, వింజమూరు, ఉలవపాడు మండలాల్లో జరిగిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఇంటింటికి తిరుగుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన పథకాల లబ్ధితోపాటు ప్రభుత్వ పనితీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఉలవపాడు మండలం భీమవరం గ్రామంలో విలేకరులతో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ వైసీపీ హయాంలో రైతులను ఆదుకున్నది లేదని, రూ.1637 కోట్ల ధాన్యం డబ్బులు 21 రోజుల్లో చెల్లిస్తానని చెప్పి ఆరునెలలు గడిచినా పట్టించుకోకపోవడంతో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ బకాయిలు చెల్లించిందన్నారు. మామిడి, పొగాకు, కొబ్బరి రైతులకు బాసటగా నిలిచిందని స్పష్టం చేశారు. పక్కా గృహాల లబ్ధిదారులకు రూ.1000 కోట్ల బకాయిలు చెల్లించామని అన్నారు. చెప్పులు కుట్టుకొని జీవించే దళితుడిని తన పక్కనే కారులో కూర్చోబెట్టుకుని అతని జీవన ప్రమాణాలు, కష్టసుఖాలు చర్చిస్తూ చంద్రబాబు వెళ్లారని, జగన్ మాత్రం నేరచరిత కలిగిన గంజాయి బ్యాచ్ ఇళ్లకు వెళ్లి పరామర్శలు చేస్తున్నాడని రాష్ట్ర ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారో జగన్ చెప్పాలని ప్రశ్నించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలోనూ మంత్రి మాట్లాడారు. సుమారు రూ.10 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. గ్రామంలో సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి మాట్లాడుతూ కరేడు భూసేకరణలో ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకుంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు రాచగల్లు సుబ్బారావు, శ్రీనివాసులు, జాజుల రవి తదితరులు పాల్గొన్నారు.

- వింజమూరులోని యాదవ్‌బజార్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మె ల్యే కాకర్ల సురేష్‌తో మంత్రి పార్థసారథి పాల్గొన్నారు. ముందుగా మంత్రికి ఎమ్మెల్యే ఘన స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం యాదవ్ బజార్‌లోని ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వంశీకృష్ణ, తహసీల్దారు హమీద్, ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి, హౌసింగ్ డీడీ వేణుగోపాల్, ఈఈ నారాయణరెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ పి.చెంచలబాబు, నాయకులు నర్సారెడ్డి, చైతన్య, సర్పంచ్ సృజన తదితరులు పాల్గొన్నారు.



ఉలవపాడు : ప్రజలకు కరపత్రాలు అందచేస్తున్న మంత్రి పార్థసారథి, ఎమ్మెల్యే ఇంటూరి

వెంగమాంబ ఆలయ హుండీల లెక్కింపు



హుండీలను లెక్కిస్తున్న సిబ్బంది

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నర్రవాడలో ఉన్న వెంగమాంబ పేరంటా లమ్మ ఆలయంలో శుక్రవారం ఆలయ కార్యనిర్వా హణాధికారి వెట్టిగుంట ఉషశీల ఆధ్వర్యంలో కోవూరు దేవదాయ ఇన్‌స్పెక్టర్ నాగమల్లేశ్వరరాజు పర్యవేక్షణలో ఆలయంలో వివిధ చోట్ల ఏర్పాటు చేసిన హుండీలను లెక్కించారు. ఆయా హుండీల ద్వారా రూ.24,68,691 నగదు, బంగారం 6, వెండి 307 గ్రాములు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీజీబీ సిబ్బంది, ఎస్‌బీఐ విశ్రాంత ఉద్యోగులు, ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 602 బేళ్లను తీసుకొని రాగా 18 కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని, 316 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 286 బేళ్లను తిరస్కరించారు. కేజీ గరిష్ఠ ధర రూ.280 కాగా, కనిష్ఠ ధర రూ. 159గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9458
వెండి కిలో ధర	రూ. 118200
వెండి ఒక గ్రాము	రూ. 121.20

ఇరుకు గదుల్లో ఇక్కట్లు

● గదులు 4.. విద్యార్థులు 320 మంది ● ఉదయగిరి జూనియర్ కళాశాల దుస్థితి



సామగ్రి నిల్వ చేసే గదిలో చదువుకుంటున్న విద్యార్థులు

ఉదయగిరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక అల్లూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు తగ్గట్టుగా తరగతి గదులు లేకపోవడంతో అధ్యాపకులు, విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కళాశాలలో నాలుగు తరగతి గదులున్నాయి. మరో నాలుగు శిథిలావస్థకు చేరి కూలే దశలో ఉన్న సమీపంలోని ఉన్నత పాఠశాలకు చెందిన ప్రాక్టికల్స్ సామగ్రి నిల్వచేసే గదుల్లో అవస్థలు పడుతూ తరగతులు నిర్వహిస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో ఆరుబయట ఎండలో పరీక్షలు, తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. మధ్యాహ్న భోజన సమయంలో సైతం విద్యార్థులకు ఇబ్బందులు తప్పడంలేదు. గత ప్రభుత్వ హయాంలో కళాశాలకు నాడు-నేడు పథకం కింద అదనపు తరగతి గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయకుండా మరమ్మతులకు మంజూరు చేశారు. అయితే కళాశాలలో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడం, తరగతి గదులు లేకపోవడం, ఇరుకుగా ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అధ్యాపకులు, విద్యార్థులు వాపోతున్నారు. చుట్టుపక్కల మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎక్కడా లేదు. దీంతో పేద విద్యార్థులంతా ఈ కళాశాలలోనే చేరుతారు. రాష్ట్ర ప్రభుత్వమైనా స్పందించి అదనపు తరగతి గదులకు నిధులు మంజూరుచేసి తమ కష్టాలు తీర్చాలని అధ్యాపకులు, విద్యార్థులు కోరుతున్నారు.



యూరియా కొరత లేదు

● శైలజాకుమారి, ఏవో

అనంతసాగరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని గ్రామాల పరిధిలో యూరియా కొరత లేకుండా చర్యలు చేపట్టామని వ్యవసాయాధికారిణి శైలజాకుమారి తెలిపారు.

? మండలంలో ఏఏ పంటలు సాగు చేస్తున్నారు.

! ఇప్పటి వరకు వరి 5,125, వేరుశెనగ 270, సజ్జ 73, పెసర 10, మినుము 30 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. వరిసాగు విస్తీర్ణంపెరిగే అవకాశాలున్నాయి.

? యూరియా ఎంత పంపిణీ చేశారు.

! ఈ సీజన్‌లో మొదటి దఫా 170 మెట్రిక్ టన్నులు, రెండోసారి 198 మెట్రిక్ టన్నుల దిగుమతి చేసి రైతులకు పంపిణీచేశాం. ఇంకా ప్రయివేటు డీలర్ల వద్ద యూరియా అందుబాటులో ఉంచాం.

? ఈక్రాప్ ఎప్పటి నుంచి చేస్తారు. దానివల్ల ప్రయోజనమేంటి.

! ఈక్రాప్ చేయాలని వీఏఏలను ఆదేశించాం. సెప్టెంబరు 15 నాటికి ప్రక్రియ పూర్తవుతుంది. ఈక్రాప్ చేయడం ద్వారా ప్రభుత్వం అందించే పథకాలు రైతులు పొందవచ్చు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



ఆత్మకూరు : ప్రత్యేక అలంకారంలో మహాలక్ష్మీ దేవి అమ్మవారు



సంగం : ప్రత్యేక అలంకారంలో రాజరాజేశ్వరిదేవి



ఉదయగిరి: ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



సీతారామపురం మండలం సిద్ధేశ్వరంలోని ఇష్టకామేశ్వరిదేవి

ఆత్మకూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా నియోజకవర్గంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచే మహిళలు ఆలయాలకు చేరుకుని భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, శివాలయం, కన్యకా పరమేశ్వరి ఆలయం, అలఘనాథస్వామి ఆలయం, బీఎస్ఆర్ సెంటర్‌లోని మహాలక్ష్మీదేవి ఆలయాలలో పూజారులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు.

●సంగం : స్థానిక తిరుమనతిప్పలో ఉన్న రాజరాజేశ్వరిదేవి ఆలయంలో శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం లలితా సహస్రనామం, హోమం తదితర పూజలు జరిగాయి. ఈ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

●ఉదయగిరి : మండలంలోని పలు ఆలయాల్లో శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా మహిళా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని గండిపాళెం, అప్పసముద్రం, చవటపల్లి, కుర్రపల్లి, ఉదయగిరి పట్టణంలోని శివాలయం, సంతానలక్ష్మి తదితర ఆలయాలకు మహిళలు ఉదయాన్నే చేరుకుని పసుపు, కుంకుమ, గాజులు, కాయాకర్పూరం, నైవేద్యాలు సమర్పించి అర్చనలు చేయించుకున్నారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

●సీతారామపురం : శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా మండలంలోని పలు ఆలయాలకు మహిళా భక్తులు పోటెత్తారు. ప్రధానంగా ఘుటికసిద్ధేశ్వరం, సీతారామపురం, అయ్యవారిపల్లి, పోలంగారిపల్లి చిన్నాగంపల్లి తదితర ఆలయాలకు మహిళలు చేరుకుని పసుపు, కుంకుమ, గాజులు, కాయాకర్పూరం, నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేపట్టారు.

న్యూస్ బాక్స్

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న వీఆర్ఏలు

అనంతసాగరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వీఆర్ఏలు శుక్రవారం తహసీల్దారు జయవర్ధన్‌కు వినతిపత్రం అందచేశారు. వేతనం పెంచాలని, ప్రమోషన్లు కల్పించాలని, డీఏలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటకృష్ణ, మొహిద్దిన్, రవి తదితరులు పాల్గొన్నారు.

గుర్రప్పస్వామికి పూజలు

వింజమూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నడిమూరులో ఉన్న గురప్పస్వామి వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం కోలాట భజనలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు సిద్ధం

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుసేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగులు, జనుములు 124 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సీహెచ్ మదన్‌మోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అవసరమైన రైతులు ఆయా రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి ఎన్‌పీసీఐ ఇనాక్టివ్ రైతుల పేర్లను రైతుసేవా కేంద్రాల్లో ప్రదర్శించడం జరిగిందన్నారు. అలాంటి వారు ఆధార్ నెంబర్‌ను బ్యాంకు ఖాతాకు అనుసంధానం చేసుకోవాలని ఆయన కోరారు.

పూర్వ విద్యార్థుల చేయూత



విద్యార్థికి నగదు బహుమతి ఇస్తున్న పూర్వ విద్యార్థులు

అనంతసాగరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సోమశిల ఉన్నత పాఠశా లలో గతేడాది పదోతరగతి ఫలితాల్లో ప్రతిభ చాటిన ముగ్గురు విద్యార్థులకు పూర్వ విద్యార్థులు నగదు ప్రోత్సాహకాలు అందచేశారు. 1984-85 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం పాఠశాలకు చేరుకొని తొలుత ఉపాధ్యాయులను సన్మానించారు. అనంతరం పదిలో ప్రతిభ చూపిన ముగ్గురికి నగదు బహుమతులు అందించారు.

విద్యార్థులకు స్టడీ కుర్చీల వితరణ



వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం అదే గ్రామానికి చెందిన దాత వల్లూరి శివ విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తల్లి జ్ఞాపకార్థం స్టడీ కుర్చీలు, ప్యాడ్‌లను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవి, ఉపాధ్యాయులు నాగార్జున, శ్రీహరి, జలీల్ సుల్తాన్, చిన్నరామయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఉదయగిరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల వైద్యఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు శిలకల్పన, వినీతలు సూచించారు. శుక్రవారం స్థానిక పాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యఆరోగ్య సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సదస్సును విజయవంతం చేయండి

దుత్తలూరు (ఉదయగిరి), జూలై 25 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో ఈనెల 31న నిర్వహించే దళితుల ఆత్మరక్షణ, ఆత్మగౌరవ, రాజ్యాధికార సాధన పోరాట సదస్సును విజయవంతం చేయాలని దళిత బహుజన పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎం రామచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ సదస్సుకు డీబీపీ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు వడ్లమూరి కృష్ణస్వరూప్, దాసరి అన్నపూర్ణలు హాజరవుతారన్నారు. కావున దళిత ఉద్యమ నాయకులు, అంబేద్కర్ వాదులు అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన కోరారు.

తరుణవాయి పాఠశాల విద్యార్థికి ట్రిపుల్ ఐటీలో సీటు

సంగం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరుణవాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థికి ఒంగోలులో ట్రిపుల్ ఐటీలో సీటు రావడంతో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. చెన్నవరపాడుకు చెందిన పి మధు చరణ్ పాఠశాలలో పదవ తరగతి చదివి పబ్లిక్ పరీక్షలో 568 మార్కులు సాధించాడు. ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేయడంతో మూడవ జాబితాలో సీటు వచ్చింది. దీంతో ఆ విద్యార్థిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, ఉపాధ్యాయులు సత్కరించారు.

వరికుంటపాడు ఎంపీడీవోగా గోపిశ్రీనివాస్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ అభివృద్ధి అధికారిగా శుక్రవారం జీ గోపిశ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న కార్యాలయ ఏవో వేణుగోపాల్‌రావు పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో వింజమూరు ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డికి ఇటీవల బాధ్యతలు అప్పగించడం జరిగింది. కాగా, ప్రస్తుతం అదే మండలంలో డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న గోపిశ్రీనివాస్‌కు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందడంతో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా పలు శాఖల అధికారులు, ఉద్యోగులు ఆయన్ను కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సీతారామపురం ఎంపీడీవోగా సాయిప్రసాద్

సీతారామపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సీతారామపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా సాయిప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులోఉండి మెరుగైన సేవలు అందిస్తానని అన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కలువాయి (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వైద్యశాలలో చికిత్స పొందుతూ వెంకటరెడ్డిపల్లి జంగాల కాలనీకి చెందిన విబూది పుల్లమ్మ (50) శుక్రవారం మృతి చెందింది. ఈ సంఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్లాట్ విధానంపై ప్రజలకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ దీపిక

ఉదయగిరి, జూలై 25 (ఆంధ్ర జ్యోతి): స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్ దీపిక సందర్శించారు. ఈసందర్భంగా ఆమె ప్రభుత్వం నూతనంగా అమలుచేసిన స్లాట్ విధానానికి సంబంధించి సాంకేతికపరంగా ఏమైనా సమస్యలు ఉన్నాయా, లేదా అని తెలుసు కున్నారు. అనంతరం కార్యాలయంలో ప్రజలకు స్లాట్ విధానంలో దస్తావేజుల తయారీ సంబంధించి పబ్లిక్ డేటా ఎంట్రీపై అవగాహన కల్పించి సమస్యలను అడిగి తెలుసుకుని నివృత్తి చేశారు. అనంతరం కార్యాలయ రికా ర్డులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అంజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ మెల్కిరోషన్, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్ఏలకు తక్షణమే పేస్కేల్ అమలు చేయాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న వీఆర్ఏలు

కలువాయి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్ఏ)ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారం దిశగా తమవంతు సహాయ సహకారాలు అందించాలని కోరుతూ శుక్రవారం వీఆర్ఏలు తహసీల్దారు శ్యామ్‌సుందరాజుకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 28వ తేదీన కలెక్టర్ కార్యాలయం వద్ద సామూహిక రాయబార కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలియజేశారు. వీఆర్ఏలకు తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని, అర్హత ఉన్న వారికి వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని, అక్రమ డ్యూటీలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థులకు బహుమతులు అందచేస్తున్న దాతలు

కలువాయి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీపినాపి జడ్పీ ఉన్నత పాఠశాలలో గత ఏడాది పదో తరగతిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు శుక్రవారం నగదు ప్రోత్సాహక బహుమతులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన దాత మదమంచి విశ్వేశ్వర చౌదరి తల్లిదండ్రులైన బాలకృష్ణ చౌదరి, కోటేశ్వరమ్మలు పొత్తూరు వంశికా పరమేశ్వరికి రూ.10వేలు, గార్లపాటి హాసినికి రూ.7వేలు, షేక్ హర్షియాకి రూ.3వేలు నగదు అందజే శారు. ఈ కార్యక్రమంలో సర్పంచు గోపిదేశి పెంచలయ్య, హెచ్‌ఎం ఎస్ జనార్ధన్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ షేక్ కాలేషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అదనపు తరగతి గదుల నిర్మాణ పనుల పరిశీలన



నిర్మాణ పనులు పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న ఏస్ఈ

ఉదయగిరి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను శుక్రవారం ఏపీఈ డబ్ల్యూఐడీసీ ఎస్‌ఈ శివకుమార్, ఈఈ కరీముల్లాఖాన్‌లు పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం ఉషశ్రీ పథకంలో భాగంగా కళాశాలకు రూ.5 కోట్లు నిధులు మంజూరయ్యాయన్నారు. అందులో రూ.3.50 కోట్లతో తరగతి గదులు, రూ.75 లక్షలతో తరగతి గదుల మరమ్మతు పనులు, రూ.75 లక్షలతో కళాశాలకు ఫర్నీచర్, ల్యాబ్ సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం అధికారులు, గుత్తేదారులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఈ సుబ్బారావు, గుత్తేదారులు గడ్డం శ్రీనివాసులు, బొజ్జా శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో గుండెపోటుతో

ఆర్టీసీ బస్సు డ్రైవర్ మృతి

● కావలి నుంచి బెంగళూరు వెళ్తుండగా ఘటన

● సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు



షేక్ రసూల్(ఫైల్)

కావలిరూరల్, జూలై 25 (ఆంధ్ర జ్యోతి): విధి నిర్వహణలో గుండె పోటుతో ఆర్టీసీ బస్సుడ్రైవర్ మృతిచెం దిన ఘటన అన్నమయ్య జిల్లా రాయ చోటి పట్టణంలోని మదనపల్లి రోడ్డు సమీపంలో శుక్రవారం తెల్లవారుజా మున జరిగింది. కావలి ఆర్టీసీ డీఎం దార్ల ఆదినారాయణ తెలిపిన వివరాల మేరకు... కావలి ఆర్టీసీ డిపోకు చెందిన ఏపీ 26 జెడ్ 0275 నెంబరు గల సూపర్ లగ్జరీ బస్ ప్రయాణికులతో గురువారం సాయంత్రం 6.30 గంటలకు కావలి నుంచి బెంగళూరుకు బయలుదేరింది. మార్గ మధ్యంలో తెల్లవారు జామున 3గంటల సమయంలో అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని మదనపల్లిరోడ్డు సమీపంలో బస్సు డ్రైవర్ షేక్ రసూల్(52)కు గుండెపోటు రావడంతో స్టీరింగ్‌పై కుప్పకూలి మృతిచెందాడు. సింగిల్ డ్రైవర్‌గా ఉన్న ఆయన గుండెనొప్పి రగానే బస్సును రోడ్డు మార్జిన్‌లో నిలిపివేశాడు. దీంతో బస్సు ముందు భాగం దెబ్బతిన్నప్పటికీ ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. కాగా ఉదయగిరికి చెందిన రసూల్ ఉద్యోగ రీత్యా కుటుంబంతో కలసి కావలి పట్టణంలోని తుఫాన్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సర్వేపల్లి కాలువలో మృతదేహం



గుర్తుతెలియని మృతదేహం

నెల్లూరు(క్రైం), జూలై 25 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు లోని పూలేబొమ్మ సమీపాన సర్వేపల్లి కాలువలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి స్థానిక వీఆర్వోకు సమాచారమిచ్చారు. వీఆర్‌వో సుబ్బలక్ష్మమ్మ మృతదేహాన్ని పరిశీలించి బాలాజీనగర్ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు ఆ మృతదేహాన్ని స్థానికుల సహకారంతో బయటకు తీశారు. 48-50 సంవత్సరాల మధ్య వయస్సు వ్యక్తి మృతిచెందాడు. మృతదేహంపై గులాబీ రంగు చొక్కా, సిమెంట్ రంగు ఉన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు బాలాజీనగర్ పోలీసులను సంప్రదించాలని ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు కోరారు.

మున్సిపల్ వాహనాల

బ్యాటరీ దొంగల అరెస్ట్



నిందితుల వివరాలు తెలుపుతున్న ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు

నెల్లూరు(క్రైం), జూలై 25(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని పాత మున్సిపాలిటీ ఆఫీస్ ఆవరణలో నిలిపి ఉన్న మున్సిపల్ వాహనాలకు ఉండే బ్యాటరీలు దొంగిలించిన ఇద్దరు నిందితులను సంతపేట పోలీసులు అరెస్ట్‌చేశారు. వివరాలను సంతపేట స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. పాత మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో నిలిపి ఉన్న చెత్తతోలే 17 ప్రభుత్వ వాహనాలకు ఉండే బ్యాటరీలను గుర్తుతెలియని దుండగులు ఈఏడాది ఫిబ్రవరి 3న దోచుకెళ్లారు. పోలీసులు దర్యాప్తు నగరంలోని ఇసుకడొంక రిక్షా కాలనీకి చెందిన షేక్ షఫీ, అల్లీపురం టిడ్కో ఇళ్లలో ఉండే దాసరి అప్పారావు నిందితులుగా గుర్తించారు. వారిని ఈనెల 24వ తేదీ రాత్రి పుట్టా ఎస్టేట్ వద్ద అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.81 వేల విలువచేసే 17 బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావు, ఎస్ఐ సుల్తాన్ బాషా, హెడ్‌కానిస్టేబుళ్లు సుబ్బారావు, లావణ్యకుమార్, కానిస్టేబుళ్లు సురేంద్ర, గోపి, అల్లభక్షును ఏఎస్పీ సీహెచ్ సౌజన్య అభినందించారు.

రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం



నిందితుడి వివరాలు తెలుపుతున్న రైల్వే డీఎస్పీ మురళీధర్

నెల్లూరు(క్రైం), జూలై 25 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌లో ఓవ్యక్తి నుంచి జీఆర్‌పీఎస్, ఆర్‌పీఎఫ్ పోలీసులు ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలను రైల్వే డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ మురళీధర్ విలేకరులకు తెలిపారు. టాటానగర్ - ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ నుంచి నెల్లూరు రైల్వే స్టేషన్‌లో దిగిన తమిళనాడు రాష్ట్రం అండిపెట్టి వట్టామ్ ప్రాంతానికి చెందిన వీ మనోజ్‌కుమార్ అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 5 కేజీల గంజాయి ప్యాకెట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ ఎన్ హరిచందన కేసు నమోదు చేశారు. డ్రగ్స్ నివారణ, సహాయం కోసం టోల్‌ఫ్రీ నెంబరు 139, 1972లను సంప్రదించాలని డీఎస్పీ కోరారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

చీటింగ్‌పై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జూలై 25 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న డబ్బు ఇవ్వకుండా మోసం చేసిన వ్యక్తిపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు... నెల్లూరులోని కోటమిట్టలో సయ్యద్ సాబీర్ కుటుంబం నివసిస్తోంది. ఆయన హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. గతేడాది అభినవ్ అనే వ్యక్తి ఫోర్డ్ ఎకో స్పోర్ట్స్ కారును సాబీర్ వద్ద కుదువపెట్టి రూ.2.50 లక్షలు నగదు తీసుకున్నాడు. ఈమేరకు పత్రం రాసిచ్చాడు. అయితే కొంతకాలానికి బాడుగ ఉందని వెంటనే తీసుకువచ్చి ఇస్తానని అభినవ్ నమ్మకంగా చెప్పి సాబీర్ నుంచి కారును తీసుకెళ్లాడు. రోజులు గడుస్తున్నా కారును ఇవ్వకపోవడంతో సాబీర్ నిలదీశాడు. కారు ఇవ్వలేనని, తీసుకున్న డబ్బు తిరిగి ఇచ్చేస్తానని చెప్పారు. అయితే ఎన్ని నెలలైనా ఆ నగదు కూడా ఇవ్వకపోగా బెదిరిస్తున్నాడంటూ సాబీర్ శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ వద్ద పెన్నానదిలోని ఇసుక రీచ్ నుంచి గురువారం అర్ధరాత్రి ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పోలీసులు శుక్రవారం సీజ్ చేశారు. స్థానికుల సమాచారం మేరకు ట్రాక్టర్లను స్టేషన్‌కు తరలించి, కేసు నమోదు చేశారు. పెనుమూరు వద్ద శుక్రవారం రాత్రి ఓ వేస్టేజి వాహనాన్ని స్థానిక టీడీపీ నేతలు పోలీసులకు అప్పగించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	134
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 475

184 పొగాకు బేళ్ల తిరస్కరణ

కలిగిరి, జూలై 25(ఆంధ్రజ్యోతి): స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శుక్రవారం రైతులు 614 పొగాకు బేళ్లు విక్రయానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీ ప్రతినిధులు పాల్గొని 430 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-169, ఆర్‌ఆర్-3, సీఆర్-10, జంపింగ్‌లాట్స్-2 కారణాలతో 184 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.160, సగటు ధర రూ.202.89గా నమోదైనట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

డ్రైనేజీ కాలువలు నిర్మించండి

బిట్రగుంట, జూలై 25(ఆంధ్రజ్యోతి): విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెం ఇందిరా కాలనీలో డ్రైనేజీ కాలువలు నిర్మించాలని జైభీం అంబేడ్కర్ సేవాదళ్ వ్యవస్థాపకుడు బత్తుల రవిచంద్ర కోరారు. శుక్రవారం ఆయన స్థానికులతో కలసి నిల్వ చేరిన మురికి నీటి కాలువలను పరిశీలించారు. దీనిపై కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరారు.

న్యూస్ బాక్స్

బాలింతలకు నిత్యావసరాల పంపిణీ

కందుకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తూర్పువడ్డిపాలెం అర్బన్ హెల్త్ సెంటర్‌లో వరల్డ్‌విజన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం 30 మంది బాలింతలు, 15 మంది చిన్నారులకు నిత్యావసరాలు, ఫుడ్ బాస్కెట్స్ పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కమిషనర్ కె.అనూష, వైద్యాధికారులు బ్యూలాగ్రేస్, స్నేహకారుణ్యలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ పద్మావతి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు ప్రభావతి, స్థానిక టీడీపీ నాయకుడు మహర్షి శ్రీను, వరల్డ్‌విజన్ సిబ్బంది, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

భవిత కేంద్రాల్లో సులభరీతిలో బోధన చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న సీఎంవో పెంచలయ్య, ఎంఈవో సుబ్బారెడ్డి

కందుకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): భవిత కేంద్రాల్లో విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా సరళమైన బోధనా పద్ధతులు పాటించాలని సమగ్రశిక్ష సహిత విద్య జిల్లా సమన్వయకర్త, సీఎంవో కె.పెంచలయ్య సూచించారు. పట్టణంలోని ఇస్కాలవారివీధి మోడల్ ప్రైమరీ పాఠశాలలోని భవిత కేంద్రాన్ని ఎంఈవో సుబ్బారెడ్డితో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించి ఆ కేంద్రంలోని విద్యార్థులతో మాట్లాడారు. చిన్నారులకు ఫిజియోథెరపి సేవలు సక్రమంగా అందేలా చూడాలని, వారికి ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలన్నీ సద్వినియోగం చేసుకునేలా శ్రద్ధ చూపాలని శిక్షకులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం డీ.కోటేశ్వరరావు, ఐఈఆర్‌టీ ఆర్.కోటేశ్వరరావు, సీఆర్‌ఎంటీ ఎం.వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడు బైండోవర్

కొండాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట పంచాయతీ వెల్లటూరివారిపాలెంలో మద్యం బెల్టు షాపుపై ఎక్సైజ్ సీఐ జలీల్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. బెల్టు షాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని మూడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడిని తహసీల్దారు కోటేశ్వరరావు వద్ద బైండోవర్ చేశారు.

కలుగోళ్ల శాంభవి ఆలయంలో చీరల వేలం

కావలి, జూలై 25(ఆంధ్రజ్యోతి): కావలి గ్రామదేవత కలుగోళ్ల శాంభవికి అలంకరించిన చీరలు శుక్రవారం ఆలయ ఆవరణలో వేలం వేశారు. ఈ వేలంలో 36 చీరలను రూ23,600లకు భక్తులు వేలంలో దక్కించుకున్నారు. దేవస్థానం ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో కోవూరు గ్రూపు ఆలయాల ఈవో సీహెచ్ కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో వేలం పాట నిర్వహించారు. ఇక నుంచి ప్రతి నెలా 4వ శుక్రవారం అమ్మవారికి అలంకరించిన చీరలు వేలం వేస్తామని ఈవో రాధాకృష్ణ తెలిపారు.

రోడ్డు భద్రతపై అవగాహన

కందుకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యంగా వాహనాలు నడపటం ద్వారా విలువైన జీవితాన్ని అంధకారంలోకి నెట్టుకోవద్దని కందుకూరు ఆర్టీవో టీవీ నాగలక్ష్మి సూచించారు. స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రోడ్డు భద్రత - యువత పాటించాల్సిన నియమాలు అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారు మాత్రమే డ్రైవింగ్ లైసెన్సు పొందాక వాహనాలు నడపాలని, వాహనాలు నడిపే, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించటం ద్వారా ప్రాణనష్టాన్ని నివారించవచ్చున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ మాట్లాడుతూ జీవితాన్ని రోడ్డు ప్రమాదాల్లో కోల్పోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ జె.అనిల్‌కుమార్, అధ్యాపకులు వై.నరేంద్ర, పి.రాజగోపాల్‌బాబు, కోటపాటి నరేష్‌రాజా, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతమే లక్ష్యం

బిట్రగుంట, జూలై 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతమే లక్ష్యంగా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీడీపీ నాయకులు టీ.ప్యాట్రిక్, మెతుకు వెంకటశేషయ్య అన్నారు. శుక్రవారం బోగోలు బజారు సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల నివాళులర్పించారు. అనంతరం ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దేవరాళ్ల తిరుపతియాదవ్, ఇజ్రాయేల్, బుర్రివెంకటరావు, పార్వతి, వీరంబొట్లు, బీజేపీ నేత గుర్రం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాలకు తుప్పు!

» శిథిలమవుతున్నా స్పందించని వైనం
» తుక్కు కింద విక్రయించాలన్నా ఆటంకాలు
» పన్నులు చెల్లించకపోవడమే కారణం
» ఆస్తుల పరిరక్షణలో అధికారుల విఫలం



తుప్పుపడుతున్న వివిధ రకాల వాహనాలు

కావలి, జూలై 25(ఆంధ్రజ్యోతి) : కావలి మున్సిపాల్టీకి కోట్లాది రూపాయల ఆదాయం వస్తున్నా మున్సిపల్ ఆస్తుల పరిరక్షణలో విఫలమవుతున్నారు. పారిశుధ్య పరిరక్షణకు ప్రతి ఏటా ఏదో స్కీం కింద లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసిన వాహనాలు కొత్తవి వస్తున్నా వాటి ఆలనా పాలనను అధికారులు విస్మరిస్తున్నారు. కొద్ది పాటి మరమ్మతులు వచ్చినా వాటిని సకాలంలో చేయించకుండా పూర్తిగా మూలన పడే వరకు వాటిని వినియోగించి కదలలేని రోజు పక్కన పడేస్తున్నారు. వాహనాలకు చెల్లించాల్సిన లైఫ్ ట్యాక్స్‌ను కూడా సక్రమంగా చెల్లించక పోవడంతో పాడైపోయిన వాహనాలు పాత ఇనుముకు విక్రయానికి కూడా నేడు ఆటంకగా మారింది. కావలి మున్సిపాల్టీలో కోట్ల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన లారీలు, ట్రాక్టర్లు, ట్రక్ ఆటోలు, వీధులు శుభ్రం చేసే మిషన్లు, దోమల మందు పిచికారి చేసే యంత్రాలు అన్నీ నేడు కోఆపరేటివ్ కాలనీ ఓవర్‌హెడ్ ట్యాంక్ ఆవరణలో మూలన పడి శిథిలమై తుప్పు పట్టి ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. వాటిని పాత ఇనుముకు అమ్మదమన్నా వాహనాల పన్నుల బకాయిలు అడ్డువస్తున్నాయి. వాటిని చెల్లిద్దామంటే పాత ఇనుముకు అమ్మితే వచ్చే సొమ్ము కన్నా 10 రెట్లు ఎక్కువగా రవాణా శాఖకు పన్నుల రూపంలో చెల్లించాల్సి వస్తోంది. శిథిలమై తుప్పు పట్టి పాడై పోతున్న వాహనాలను ఏమి చేయాలో అర్థం కాక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్తేకదా పాడైపోతే మన కెందుకులే.. ఎప్పుడైనా బదిలీపై వెళ్లే వాళ్లమే కదా అనే భావనలో అధికారులు కాలం వెళ్లదీస్తున్నారు.



శిథిలమవుతున్న హైడ్రాలిక్ లారీ

● వాహనాల నిర్వహణ గాలికి

ముస్సిపల్ వాహనాలు కావడంతో వాటి నిర్వహణను అధికారులు గాలికి వదిలేస్తున్నారు. ఏ చిన్న మరమ్మతులు వచ్చినా సకాలంలో చూపించుకోకుండా వాటిని నడుపుతున్న డ్రైవర్లకే ఆ భారం వేస్తుండటంతో వారు వాహనం మూలన పడే వరకు వాటి సమస్యలను చెప్పడంలేదు. కొన్ని సందర్భాల్లో బయట మెకానిక్‌ల వద్ద మరమ్మతులు చేయించినా వారికి సకాలంలో డబ్బులు చెల్లించడం లేదు. దీంతో వాహనాల నిర్వహణను పూర్తిగా గాలికి వదిలేస్తున్నారు.

● విక్రయాలతో వచ్చే ఆదాయం కన్నా పన్నులే అధికం

మున్సిపల్ పాత వాహనాలు విక్రయిస్తే వచ్చే ఆదాయం కన్నా వాటి విక్రయానికి రవాణా శాఖ అనుమతులు తీసుకునేందుకు వారికి చెల్లించాలన్ని పన్నుల బకాయిలే 10 రెట్లు అధికంగా ఉందని కొందరు అధికారులు చెబుతున్నారు. వాస్తవంగా పాత వాహనాలను విక్రయించాలంటే వాటి ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను రవాణా శాఖ నుంచి పొందాలి. వాహనాలకు చెల్లించిన లైఫ్ ట్యాక్స్ కాలపరిమితి దాటిపోయిన తర్వాత మళ్లీ వాటిని రవాణా శాఖ వద్దకు తీసుకెళ్లి ఫిట్‌నెస్ ఉంటే వాటికి లైఫ్‌ట్యాక్స్ రెన్యువల్ చేయాల్సి ఉంది. కావలి మున్సిపాల్టీలో ఏ వాహనంకు కూడా వాటి ఫిట్‌నెస్, లైఫ్‌ట్యాక్స్‌ను పట్టించుకోకుండా తిరిగినన్ని రోజులు తిప్పి కదలన రోజున మూలన పడేస్తున్నారు. ఇంతవరకు కాలం గడిసి పోగా మూలన పడ్డ వాహనాలు చివరకు పాత ఇనుముకు విక్రయించాలన్నా వాటి ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ తప్పనిసరిగా ఉండాలి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ తీసుకోవాలంటే వాటి లైఫ్ ట్యాక్స్‌లను రెన్యువల్ చేయనందున వాటిని ఇప్పుడు చెల్లించాలంటే ప్రభుత్వ నిబంధనల మేరకు పెనాల్టీలు కట్టి చెల్లించలంటే వాహనాలు విక్రయం ద్వారా వచ్చే ఆదాయం కన్నా రవాణా శాఖకు చెల్లించాల్సిన పన్నులే అధికంగా ఉండటంతో అధికారులు చేతులెత్తేస్తున్నారు. వాస్తవంగా రెండు శాఖల మధ్య ఉన్న ఈ పన్నుల సమస్యను రవాణా శాఖ అధికారులతో మాట్లాడి పన్నులు తగ్గించుకుని పాత వాహనాలు వేలం వేస్తే మున్సిపాల్టీకి కొంత ఆదాయం చేకూరుతోంది. ఒకవేళ అది వీలుపడకపోతే రవాణా శాఖకు వాటి నిబంధనల మేరకు పన్నులు చెల్లించి వాహనాలు వేలం వేస్తే మున్సిపాల్టీకి కొంత నష్టం వచ్చినా రవాణా శాఖ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతోంది. ఉన్నతాధికారులు అన్ని కోణాల్లో ఆలోచించి పాత వాహనాలు తప్పు పట్టి పాడైపోకుండా ఆశాఖతో సమన్వయం చేసుకుని వాటిని విక్రయిస్తే ఏదో విధంగా ఆదాయం ప్రభుత్వానికి చేకూరుతోంది కదా అనే కోణంలో ప్రజలు ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది.



పనికిరాకుండా పోయిన ట్రాక్టర్లు, ఇతర వాహనాలు

ఆధార్ కేంద్రాన్ని వినియోగించుకోండి

వలేటివారిపాలెం, జూలై 25(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎస్టీ పిల్లలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నరేంద్రదేవ్ తెలిపారు. వలేటివారిపాలెం గ్రామ సచివాలయంలో ఎస్టీ పిల్లలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్‌కార్డు లేని ఎస్టీ పిల్లలు ఆధార్ నమోదు చేయించుకోవాలని తెలిపారు.



ఆధార్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

'టిడ్కో'లో డ్రైనేజీ సమస్య పరిష్కారం

కావలి, జూలై 25(ఆంధ్రజ్యోతి) : మద్దూరుపాడులోని టిడ్కో గృహ సముదాయంలో ఏర్పడిన డ్రైనేజీ సమస్యను మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ పరిష్కరింప చేశారు. డ్రైనేజీలో నీరు పోకపోవడంతో స్థానికులు ఫోన్ చేయగా స్పందించిన కమిషనర్ వెంటనే శానిటరీ ఇన్‌స్పెక్టర్ బషీర్‌తో పాటు పారిశుధ్య కార్మికులను తీసుకెళ్లి పరిశీలించారు. వెంటనే ఆ సమస్యను పరిష్కరింపచేశారు.



డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రావణ్‌కుమార్

పేదల సమస్యలపై నిరంతర పోరాటమే లక్ష్యం

● సీపీఐ నేత రావుల వెంకయ్య

కందుకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): పేదల సమస్యలపై నిరంతరం పోరాటం చేయడమే కమ్యూనిస్టు పార్టీల లక్ష్యమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు రావుల వెంకయ్య పేర్కొన్నారు కమ్యూనిస్టులకు కాలం చెల్లిందని ప్రచారం చేయడం ద్వారా ప్రజలను వంచించి ప్రజాధనాన్ని దోచుకోవటమే లక్ష్యంగా కుహనా రాజకీయ నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. సీపీఐ కందుకూరు నియోజకవర్గ మహాసభ శుక్రవారం పట్టణంలోని పామూరు బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఓ కల్యాణ మండపంలో జరిగింది. ముందుగా ఓవీరోడ్డులోని పార్టీ కార్యాలయం నుంచి సభావేదిక వరకు ఎర్రజెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ మహాసభలో రావుల వెంకయ్య మాట్లాడుతూ వందేళ్ల కాలంలో సీపీఐ ఎన్నో ప్రజాపోరాటాలు చేసి విజయాలు సాధించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసిందన్నారు. ముందెన్నడూ లేనివిధంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 ఏళ్లలో రూ.110 లక్షల కోట్ల అప్పులు చేసి దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టాడని, కార్పొరేట్ సంస్థలకు ఏజెంట్‌గా పనుచేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు పాలన జగన్ పాలననే గుర్తుతెస్తోందని, ఎన్నికల వాగ్దానాలు అమలుచేయటంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. సీపీఐ నెల్లూరు జిల్లా కార్యదర్శి దామా అంకయ్య మాట్లాడుతూ సోమశిల ఉత్తరకాలువ పొడిగింపు, రామాయపట్నం పోర్టు సీపీఐ పోరాటాల ఫలితంగానే సాధించుకున్నట్లు తెలిపారు. కరేడులో ఇండోసోల్ కంపెనీకి భూములు ఇవ్వబోమని గ్రామసభలో ప్రజలు ముక్తకంఠంతో చెప్పటమే గాక ఏకగ్రీవ తీర్మానం చేసినందున భూసేకరణ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని, కందుకూరు పట్టణంలో పారిశుధ్య కార్మికుల కోసం ప్రత్యేక కాలనీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ మహాసభలో తీర్మానాలు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోకూరి మాలకొండయ్య, పీ.బాలకోటయ్య, వై.ఆనంద్‌మోహన్, బొజ్జా చంద్రమోహన్, ఆదినారాయణ, నాగరాజు, కాకుమాను రమణమ్మ, మెండ శైలజ, తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు నియోజకవర్గస్థాయి మహాసభలో మాట్లాడుతున్న రావుల వెంకయ్య

సుభానీ మనీస్కాం సూత్ర, పాత్రధారి

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డే!

● మద్యం స్కాం పక్కదారి పట్టించేందుకు యత్నం ● తెలుగు తమ్ముళ్ల ధ్వజం

కావలి, జూలై 25(ఆంధ్రజ్యోతి) : కావలిలో సంచలనం కలిగించిన సుభానీ మనీ స్కాంలో సూత్రధారి, పాత్రధారి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డేనని టీడీపీ నేతలు ఆరోపించారు. బెంగళూరు నుంచి సుభానీని కావలికి తీసుకువచ్చి ఆయనకు ఆశ్రయం కల్పించి అన్నీ తానై చూసుకుంటూ ప్రతినెలా ఆయన నుంచి ముడుపులు తీసుకుంటూ మనీ స్కాంకు సహకరించారని, అందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయన్నారు. కావలి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్ బాబు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, జ్యోతి బాబూరావు, పోతుగంటి అలేఖ్య, కండ్లగుంట మధుబాబు నాయుడు, పొట్లూరి శ్రీనివాసులు, దేవరకొండ శ్రీనివాసులు, పద్మావతి శ్రీదేవి, తిరువీధి ప్రసాద్, దావులూరి దేవకుమార్, బాలగురుస్వామి, జనసేన నాయకుడు సిద్దూ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో సంచలనం కలిగిస్తున్న మద్యం స్కాంలో కావలి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి పేరు వస్తుండటంతో దానిని పక్కదారి పట్టించేందుకు ఆయన సుభానీ మనీ స్కాంలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డికి ముడుపులు ముట్టాయని ఆరోపణలు చేస్తున్నారన్నారు. మనీ స్కాంలో సూత్రధారులంతా వైసీపీకి చెందిన వారేనన్నారు. 2021లో ఆ స్కాంకు కావలిలో ఆశ్రయం కల్పించి అప్పటి నుంచి తద్వారా లబ్ధిపొందుతూ ఉండగా స్కాం బాధితులు టీడీపీ ఎమ్మెల్యే కృష్ణారెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన పోలీసుల దృష్టికి తీసుకెళ్లారన్నారు. దీంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారన్నారు. అయితే ప్రతాప్‌రెడి మద్యం స్కాంలో ఇరుక్కోవడంతో ఆయనను పోలీసులు ఏక్షణంలోనైనా అరెస్ట్ చేసే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యేకు ముడుపులు ముట్టినట్లు ఆయన చేసే ఆరోపణలను రుజువు చేస్తే తాము ఆయన కాళ్ల కింద దూరుతామని, రుజువు చేయలేక పోతే ఎమ్మెల్యే కాళ్లకింద దూరతావా అని ప్రశ్నించారు. మా ఎమ్మెల్యేపై దిగజారుడు వాఖ్యలు చేస్తే సహించేదిలేదన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

లార్వా సర్వే పారదర్శకంగా నిర్వహించాలి

● జిల్లా మలేరియా అధికారి హుసేనమ్మ ● విద్యార్థులకు అవగాహన

కావలి(టౌన్), జూలై 25(ఆంధ్రజ్యోతి) : లార్వా సర్వే పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా మలేరియా అధికారి హుసేనమ్మ పేర్కొన్నారు. డెంగ్యూ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని వెంగళరావునగర్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ముసునూరు జడ్పీ హైస్కూల్‌లో కీటక జనిత సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు డ్రైడే డ్రైడే ఆవశ్యకత గురించి తెలుసుకుని పాటించాలన్నారు. దోమల్లో రకాలు, వాటి వల్ల వచ్చే వ్యాధులు గురించి అవగాహన కల్పించారు. వర్షాకాలంలో నీటి నిల్వలు వృద్ధి చెంది వాటిలో దోమల ఉత్పత్తి చెంది జ్వరాలు పెరిగే అవకాశముందని, లార్వా సర్వే పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌తో వెక్టార్ కంట్రోల్ హైజిన్ యాప్, పారిశుధ్య కార్యక్రమాలపై చర్చించారు. అనంతరం ఏరియా వైద్యశాలలోని సెంటినల్ సర్వలెన్స్ సెంటర్‌లో జరిగే డెంగ్యూ పరీక్షల గురించి సూపరింటెండెంట్ డాక్టర్ అనూష, ఆర్‌ఎంవో ప్రవీణ్‌తో చర్చించారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి నాగార్జున, డాక్టర్ మహేష్ పాల్గొన్నారు.



పారిశుధ్య కార్యక్రమాలపై కమిషనర్‌తో చర్చిస్తున్న జిల్లా మలేరియా అధికారి హుసేనమ్మ

పాఠశాలకు బీరువా వితరణ

కందుకూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని విక్కిరాలపేట ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన గుండాబత్తిన పెదకోటయ్య, నాగమ్మ దంపతులు, వారి కుమారులు శుక్రవారం రూ.10 వేలు విలువ జేసే బీరువా బహూకరించారు. విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, ఇతర విద్యాసామగ్రి, చెప్పులు, టేబుల్, చాపలు, చిన్న కుర్చీలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారి కుమారులైన కొండలరావు, శ్రీనివాసులు, మార్కండేయులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఏజీఎం డెవలపర్స్ తరపున అన్నివిధాలుగా తోడ్పాటు అందిస్తామని, విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బడేసాహెబ్, ఐసీడీఎస్ సూపర్‌వైజరు నీలాంబరి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

బాధితులకు అండగా ఉంటాం

● వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకరరావు

ఉలవపాడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రజల అనుమతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం బడా వ్యాపారులకు అక్రమంగా భూములను దోచిపెట్టాలని చూస్తుందని, బాధితులకు అండగా ఉండామని మాజీ ఎమ్మెల్సీ, వైసీపీ అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకరరావు అన్నారు. శుక్రవారం కరేడు భూసేకరణ బాధిత గ్రామలైన రామకృష్ణాపురం గిరిజన కాలనీ, ఉప్పరపాలెం ఎస్సీ కాలనీలను ఆయన సందర్శించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. పూర్వీకుల కాలం నుంచి ఇక్కడే నివాసం ఉంటున్నామని, ఉంటున్న గ్రామం వదిలి తెలియని కొత్తప్రాంతంలో మేము బతకలేమని బాధితులు వాపోయారు. రెండు గ్రామాల ప్రజల మనోభిప్రాయాలు తెలుసుకున్న అనంతరం జూపూడి విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలే ధ్యేయంగా భావిస్తే లక్షల ఎకరాల బంజర భూములు ఉన్నాయని, వాటిని వృద్ధి చేయొచ్చన్నారు. వాటిని వదిలేసి పచ్చని పంటపొలాల జోలికి వస్తే స్థానికులు, ప్రజా సంఘాలు, వామపక్ష పార్టీలతో కలిసి రైతులు, గ్రామస్థుల పోరాటంలో భాగసామ్యులం అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రిపబ్లికన్ పార్టీ ప్రతినిధిని చెన్నకెశవులు, రైతు ఉద్యమ నాయకుడు మిరియం శ్రీనివాసులు, స్థానిక వైసీపీ నాయకులు ధనకోటి, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.



జూపూడితో మాట్లాడుతున్న గిరిజన మహిళలు

ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి

● కందుకూరు ఏడీఏ శేషారెడ్డి

లింగసముద్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి) : పురుగు మందులు లేని వ్యవసాయం వైపు రైతులు దృష్టి సారించేలా అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకోవాలని కందుకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు శేషారెడ్డి చెప్పారు. శుక్రవారం మండలంలోని వెంగళాపురం గ్రామ సమీపంలోని పొలాల్లో వ్యవసాయ అధికారులు, సిబ్బంది పొలాలను సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజుల శిక్షణలో భాగంగా ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు.ప్రకృతి వ్యవసాయం వలన పంటలు అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ఇందులో భాగంగా ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్, రుతుపవనాల ముందు దుక్కులు దున్ని 10 రకాల విత్తనాలను చల్లితే వచ్చే ప్రయోజనాలను గురించి విరించారు. అతి తక్కువ పెట్టుబడితో ఈ విధానంలో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చన్నారు. విచ్చలవిడిగా పురుగు మందులు వాడితే దుష్పరిమాణాలు తప్పవన్నారు. ఈ కార్యక్రమాన్ని అన్ని మండల్లాలో విస్తరించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బీ.రవికుమార్, అధికారులు గీత, అబ్దుల్ రహీం పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై క్షేత్ర పరిశీలనలో వ్యవసాయశాఖ అధికారులు

కొలతల ప్రకారం 'ఉపాధి' పనులు చేయాలి



యర్రారెడ్డిపాలెంలో ఉపాధి పనుల శ్రామికులతో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసులు

లింగసముద్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ పనుల్లో టెక్నికల్ అసిస్టెంట్లు ఇచ్చిన కొలత ప్రకారం పనులు చేయాలని ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు చెప్పారు. శుక్రవారం మండలంలోని యర్రారెడ్డిపాలెంలోని కుంట పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన శ్రామికులతో మాట్లాడుతూ, టీఏలు ఇచ్చిన కొలతల ప్రకారం శ్రామికులు పనులు చేస్తే ఎక్కువ నగదు వస్తుందని చెప్పారు. శ్రామికులకు పనికి తగిన వేతనం వచ్చేలా టీఏలు, ఎఫ్ఏలు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఒకరి బదులు మరొకరు పనులకు రాకూడదన్నారు. బోగస్ మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ గ్రామంలో పనులు అడిగిన శ్రామికులకు 70 నుంచి 80 రోజులు పనులు కల్పించామన్నారు.

ఈ నీరు తాగేదెలా!?

లింగసముద్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంతోపాటు వలేటివారిపాలెం మండలంలోని 48 గ్రామాలకు వస్తున్న రాళ్లపాడు-రోళ్లపాడు నీటి పథకం మంచినీరు కలుషితమైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈనెల 15 నుంచి రెండు రోజులపాటు పెంట్రాల వద్ద ఉన్న ట్రీట్‌మెంట్ వాటర్ ప్లాంట్‌ను శుభ్రం చేసి, అందులో ఆలం, గ్యాస్ కలిపి, ప్రజలకు నీటి సరఫరా చేశారు. అయినా మంచినీరు పచ్చగావస్తూ, దుర్వాసన వస్తోంది. ఈనీటితో స్నానం చేస్తే శరీరం జిలగా ఉంటోందని పలువురు చెబుతున్నారు. ఈ విష యమై ఏఈ సీహెచ్ రాజశేఖర్‌ను వివరణ కోరగా ఎక్కడైనా పైపుల స్కవర్ల వద్ద మురుగు నిల్వ ఉండి, నీరు పచ్చగా వస్తుండవచ్చని చెప్పారు. పరిశుభ్రమైన నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.




నీటి పథకం నుంచి పచ్చగా వస్తున్న మంచినీరు

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

శనివారం 26 జూలై 2025



కుంకుమార్చన కౌంటర్ వద్ద బారులు తీరిన భక్తులు

● శ్రావణ మాసం ఎఫెక్ట్

కిక్కిరిసిన అమ్మవారి ఆలయం

శ్రావణమాసం తొలి శుక్రవారం కావడంతో తిరుచానూరు పద్మావతి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మహిళా భక్తుల తాకిడి ఎక్కువగా కనిపించింది. కుంకుమార్చన సేవా టికెట్ల కోసం పోటీపడ్డారు. అమ్మవారి సర్వదర్శనానికి గంటన్నరకు పైగా సమయం పట్టింది. సుపథం దర్శనానికీ రద్దీ పెరగడంతో భక్తులు క్యూలలో బారులుతీరారు. రాత్రి వరకు రద్దీ కొనసాగింది. లడ్డూ కౌంటర్, నిత్యాన్నదానం వద్ద భక్తుల సందడి కనిపించింది.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి




సముద్రం అల్లకల్లోలం

తూపిలిపాళెం సముద్రతీరంలో ఎగసిపడుతున్న అలలు

అల్పపీడన ప్రభావంతో సముద్రతీరంలో అలలు ఉద్రిక్తంగా ఎగిసిపడుతున్నాయి. వాకాడు, కోట, చిల్లకూరు, తడ మండలాలలో సుమారు 69 కిలోమీటర్లు మేర విస్తరించిన తీరంలో రాకాసి అలలు ఎగిసిపడుతుండటంతో మత్స్యకారులు వేటకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

ఇలా.. భద్రపరిచారు



నాయుడుపేట మండలం పుదూరులో అధికారుల అనుమతి లేకుండా గురువారం గాంధీ విగ్రహాన్ని కొందరు చోటా నాయకులు పగలగొట్టి శ్మశానంలో పడేశారు. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు రావడంతో శుక్రవారం ఎంపీడీవో సురేష్‌బాబు గ్రామానికి చేరుకొని విగ్రహాన్ని తీసేసిన స్థలాన్ని పరిశీలించారు. శ్మశానంలో పడేసిన గాంధీ విగ్రహ భాగాలను తీసుకొచ్చి పంచాయతీ కార్యాలయంలో భద్రపరిచారు. ఈ ఘటనపై గ్రామంలోని కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఎంపీడీవో లేదా పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు చేస్తేనే కేసు నమోదవుతుందని అర్బన్ సీఐ బాబి తెలిపారు.

- నాయుడుపేట టౌన్, ఆంధ్రజ్యోతి

తిరుపతిలో 12 మెగావాట్లతో

వేస్ట్ టు పవర్ ప్లాంట్

సీఎం వచ్చిన ఆరు రోజుల్లోనే అనుమతిస్తూ జీవో జారీ

మూడు జిల్లాల నుంచీ 600 టన్నుల చెత్త సేకరణ

33 ఎకరాల భూమి గుర్తించాలంటూ కలెక్టర్‌కు లేఖ



ఈనెల 19వ తేదీన తూకివాకం వద్ద ప్లాంటు పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

తిరుపతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో వేస్ట్ టు పవర్ ప్లాంటు (చెత్త నుంచి కరెంటు తయారీ) ఏర్పాటుకు అనుమతినిస్తూ ప్రభుత్వం శుక్రవారం జీవో జారీ చేసింది. తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు చెందిన పలు నగర, పురపాలక, పంచాయతీల నుంచీ రోజువారీ 600 టన్నుల చెత్తను సేకరించి దాంతో కరెంటు ఉత్పత్తి చేసేలా పరిధిని సైతం నిర్ణయించారు. పవర్ ప్లాంట్ కోసం అనువైన 33 ఎకరాల భూమిని గుర్తించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ప్రభుత్వం ఆదేశించింది. అదే సమయంలో ప్లాంట్ ఏర్పాటుకు టెండర్లు పిలవాలని ఏపీ (నూతన, పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ) ఎన్‌ఆర్‌ఈడీసీని ఆదేశించింది. కాగా, తిరుపతిలో ఏర్పాటయ్యే పవర్ ప్లాంట్‌లో విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన చెత్తను సమీకరించేందుకు గానూ ప్రభుత్వం తిరుమల సహా అన్నమయ్య జిల్లా కోడూరు ఇండస్ట్రియల్ ఏరియా, పీలేరు మేజర్ పంచాయతీ, చిత్తూరు జిల్లా నుంచీ చిత్తూరు కార్పొరేషన్, పలమనేరు, నగరి మున్సిపాలిటీలు, తిరుపతి జిల్లాలో తిరుపతి కార్పొరేషన్, పుత్తూరు, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలు, చంద్రగిరి, రేణిగుంట మేజర్ పంచాయతీలు, తిరుపతి రూరల్ మండలాలను ఎంపిక చేసింది. వీటిలో రోజువారీ వచ్చిపడే 600 టన్నుల చెత్తలో అత్యధికంగా తిరుపతి కార్పొరేషన్ నుంచీ 227 టన్నులు వస్తోంది. తర్వాత తిరుమల నుంచీ 90, చిత్తూరు నుంచీ 62, శ్రీకాళహస్తి నుంచీ 50 టన్నుల చొప్పున చెత్త ఈ ప్లాంటుకు చేరనుంది. ఈ వ్యవహారంలో సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయాలు ఎంత వేగంగా ఉంటాయన్నది జిల్లా ప్రజలకు మరోసారి తెలిసి వచ్చింది.

12 ప్రాంతాలకు సంబంధించి ప్లాంట్‌కు దూరం, సేకరించే చెత్త పరిమాణం వివరాలిలా ఉన్నాయి.

ప్రాంతం	ప్లాంట్‌కు దూరం (కి.మీ)	రోజువారీ చెత్త (టన్నుల్లో)
తిరుపతి	000	227
పుత్తూరు	34	24
శ్రీకాళహస్తి	40	50
నగరి	49	14
చిత్తూరు	70	62
పలమనేరు	108	18
తిరుపతి రూరల్	15	30
చంద్రగిరి	16	20
కోడూరు ఇండస్ట్రియల్ ఏరియా	50	25
రేణిగుంట	10	20
పీలేరు	50	20
తిరుమల	35	90

అంతా.. ఆరు రోజుల్లోనే : సీఎం చంద్రబాబు ఈనెల 19వ తేదీన తిరుపతి పర్యటనకు వచ్చారు. ఆ సందర్భంగా తిరుపతి కార్పొరేషన్‌కు చెందిన రేణిగుంట మండలం తూకివాకంలోని వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంటును పరిశీలించారు. ప్లాంట్ నిర్వహణ బాగుందని అధికారులను అభినందించారు. అక్కడ చెత్త నుంచి కరెంటు ఉత్పత్తి చేసే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇది జరిగిన సరిగ్గా ఆరో రోజుకల్లా శుక్రవారం తిరుపతిలో 12 మెగావాట్ల సామర్థ్యంతో వేస్ట్ టు పవర్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతినిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇలా ఆరు రోజుల్లోనే సీఎం సూచన.. కార్యరూపం దాల్చడం, చంద్రబాబు వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నారనేందుకు నిదర్శనం.

అనన్య సందడి



సినీ నటి అనన్య శుక్రవారం చిత్తూరు, తిరుపతి నగరాల్లో పర్యటించారు. తాను బ్రాండ్ అంబాసిడర్‌గా వున్న ఏషియన్ పెయింట్స్ దుకాణాలను సందర్శించారు. గుర్తుపట్టిన జనాలతో సెల్ఫీలు దిగి సందడి చేశారు.





రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

పరిహారమిచ్చే వరకు భూముల్లో దిగనివ్వం

● రోడ్డుపై బైఠాయించి టిప్పర్లను అడ్డుకున్న రైతులు

కోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): 'భూములను తీసుకునేటప్పుడు తియ్యగా మాటలు చెప్పారు.ఇప్పుడేమో పరిహారం కోసం ఏళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు. అడిగి అడిగి మాకు ఓపిక నశించింది.పరిహారం ఇచ్చేంతవరకు భూముల్లోకి దిగనివ్వం' అంటూ రైతులు రోడ్డుపై బైఠాయించి టిప్పర్లను అడ్డగించారు. రైతుల కథనం మేరకు.. కోట మండలం నెల్లూరు పల్లికొత్తపాళెం గ్రామాలకు చెందిన 24 మంది రైతులు ఎకరా రూ.పది లక్షల చొప్పున ఆప్కో సంస్థ ద్వారా సాగరమాల రోడ్డు విస్తరణకు ఇచ్చారు. ఆ రైతులు ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నా ఇప్పటి వరకు పైసాకూడా పరిహారం ఇవ్వలేదు. ఈ క్రమంలో శుక్రవారం విశ్వనాథపుర అగ్రహారం వద్ద రైతులు సాగరమాల రోడ్డుపై బైఠాయించారు. టిప్పర్లను పొలాల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. ఉదయం 10నుంచి రాత్రి 8.30 గంటల వరకు రైతులు రోడ్డుపైనే కూర్చున్నారు. తహసీల్దారు జయజయరావు సంఘటనాస్థలికి చేరుకొని రైతులకు నచ్చ చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వినలేదు. టీడీపీ నాయకులు జలీల్ అహ్మద్, మోహన్ రెడ్డి, మధుయాదవ్ తదితరులు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, కలెక్టర్ వెంకటేశ్వర్, సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనాతో చర్చించి ద్వారా రైతులకు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా ససేమిరా అన్నారు. శనివారం నుంచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అధికారులకు చెప్పి రాత్రి 8.45 గంటలకు రైతులంతా ఇళ్లకు వెళ్లిపోయారు.

నూతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి

● వైద్యులకు త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సూచన



ఉత్తమ ప్రతిభ కనబరిచిన వైద్యులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

తిరుపతి(వైద్యం), జూలై 25(ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో అధునాతన పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నప్పుడే మెరుగైన వైద్యసేవలు అందించగలరని డాక్టర్లకు త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి సూచించారు. తిరుపతిలోని ఎస్వీ వైద్య కళాశాల ఆవరణలోని ఆడిటోరియంలో అల్మిని అసోసియేషన్ శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ఇప్పటికే రోబోటిక్ వైద్యసేవలు పెరిగిపోయాయి. వాయిస్ అథారిటీ వైద్య చికిత్సలు వచ్చినా ఆశ్చర్యం లేదు. ఇక, అత్యాధునిక వైద్య పరికరాలు రానున్నాయి. ఇలా వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీనికి తగ్గట్టు వైద్యులు తమ వైద్య పద్ధతులను మార్చుకోవాలి. సేవా భావాన్ని జీవన వైద్యంలో జనరిక్ మెడిసిన్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)లో ఆధునిక పరిజ్ఞానంతో అనుసంధానం చేయాలి' అని సూచించారు. రోగులు వైద్యంకోసం తమ శరీరాన్ని పూర్తిగా వైద్యులకు అప్పగిస్తారంటే వైద్యులపై వారికి ఎంత నమ్మకం ఉంటుందో గ్రహించాలన్నారు. ఆ నమ్మకానికి తగిన రీతిలో వైద్యులు నడుచుకోవాలన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో కంటే మన రాష్ట్రంలో ప్రతిభ కలిగిన డాక్టర్లు ఉన్నారన్నారు. 50 ఏళ్లుగా అల్మిని అసోసియేషన్ చేస్తున్న సేవలకు, కృషికి తిరుపతి మోడల్‌గా గుర్తించాలన్నారు. అనంతరం ఆయన ఉత్తమ వైద్యసేవలు అందించిన పలువురు డాక్టర్లకు ప్రశంసా పత్రాలను అందించారు. అల్మిని అసోసియేషన్ నెట్వర్క్ ప్రతీ వైద్య కళాశాలకు వెన్నుముకలా గొప్ప సహకారం అందిస్తున్నారని కలెక్టర్ వెంకటేశ్వర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్, అల్మిని అసోసియేషన్ ఆర్గనైజింగ్ కమిటీ చైర్‌పర్సన్ రమేష్ బాబు, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు, రుయా సూపరింటెండెంట్ రాధ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో అనవసర ఫ్లెక్సీలు, బ్యానర్ల నిషేధం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో అనవసర ఫ్లెక్సీలు, బ్యానర్లు నిషేధిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. వీసీ అప్పారావు ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యా వాతావరణాన్ని కలుషితం చేసే విధంగా యూనివర్సిటీలో ఫ్లెక్సీలు, బ్యానర్ల సంస్కృతి పెరుగుతోందని భావించారు. వీటివల్ల విద్యార్థులు, ఉద్యోగులు అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. యూనివర్సిటీని సందర్శించే మేధావులు, శాస్త్రవేత్తలు ఇటువంటి ఫ్లెక్సీలను చూసి ఆశ్చర్యపోతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, నాయకులు ఇందుకు సహకరించాలని కోరారు.

తిరుపతికి 'నీవా' నీళ్లు

● 'తొలి అడుగు'లో మంత్రి నిమ్మల



తిరుపతి, జూలై25(ఆంధ్రజ్యోతి): 'నీవా' బ్రాంచ్ కెనాల్ ద్వారా కళ్యాణి డ్యామ్ నింపి తిరుపతికి తాగునీటిని అందిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. తిరుపతి చింతలచేను వద్ద శుక్రవారం జరిగిన 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి, ఏపీజీబీసీ చైర్‌పర్సన్ సుగుణమ్మతో కలసి ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. దుస్తులు ఇస్త్రీ చేస్తూ, నీటిబిందెలు అందిస్తూ జనంతో మమేకమయ్యారు. తిరుపతికి తాగు, పారిశ్రామిక అవసరాలకు నీటిని అందించేలా కండలేరు రిజర్వాయర్ నుంచి మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయర్‌కు నీటిని తరలిస్తామన్నారు. 'అధికారం వస్తే రప్పా...రప్పా నరికేవాళ్లు కావాలా? సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు అందించి చల్లగా చేసుకునేవాళ్లు కావాలా? ఆలోచించండి' అంటూ ప్రజలకు సూచించారు. తప్పులు చేసేవారు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలుంటాయని హెచ్చరించారు. పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నేతలు రుద్రకోటి సదాశివం, ఎన్.విజయకుమార్, బీవీ కీర్తి, శ్రీధర్ వర్మ, ఊకా విజయ్‌కుమార్, సూరా సుధాకర్‌రెడ్డి, బుల్లెట్ రమణ, దంపూరు భాస్కర్‌యాదవ్, పుష్పావతి యాదవ్, అన్నా అనిత, కరాటే చంద్ర, పాటకం వెంకటేష్ పాల్గొన్నారు.

ఎర్రచందనం స్పెషల్ కోర్టు ఎస్‌పీపీగా అమరనారాయణ

తిరుపతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా నమోదయ్యే ఎర్రచందనం అక్రమ రవాణా కేసుల్ని తిరుపతి కేంద్రంగా విచారించే ప్రత్యేక కోర్టు (ఏడీజే కోర్టు)కు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది ఎ.అమర నారాయణ నియమితులయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ 29న ఆయన నియామకానికి సంబంధించి కలెక్టర్ వెంకటేశ్వర్ పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించింది. ఆ మేరకు అమరనారాయణను మూడేళ్లపాటు ఎస్‌పీపీగా నియమిస్తూ రాష్ట్ర హోమ్ శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్మార్ట్ మీటర్లపై అపోహలు వీడండి

- సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు -



తిరుపతి(ఆటోనగర్), జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు అమర్చడం వల్ల వినియోగదారులపై భారం పడదని, వినియోగదారులే విద్యుత్ బిల్లులు నియంత్రించుకోవచ్చని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో వినియోగదారులు అపోహలు వీడాలని పేర్కొన్నారు. ఈ మీటర్ల వల్ల మరింత పారదర్శకత ఉంటుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వ విద్యుత్ పంపిణీ పునర్ వ్యవస్థీకరణ పథకం(ఆర్డీఎస్ఎస్)లో భాగంగాఅన్ని రాష్ట్రాల్లో ఈ మీటర్లు అమర్చుతున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఏపిఈఆర్‌సీ) 2021 ఫిబ్రవరిలో మీటర్లు అమర్చడానికి అనుమతులు మంజూరు చేసిందని, సంస్థ పరిధిలోని ప్రభుత్వ, వాణిజ్య సర్వీసులకు మాత్రమే ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. స్మార్ట్ మీటర్లు అమర్చిన అనంతరం బిల్లుల్లో అదనపు చార్జీలు విధించేది లేదని తెలిపారు. వినియోగదారులకు అనుమానాలు ఉంటే టోల్‌ఫ్రీ నెంబరు 1912కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



సతీష్‌రెడ్డి

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. డీఆర్డీవో మాజీ చైర్మన్ సతీష్‌రెడ్డి, మహారాష్ట్ర మంత్రి పంకజ గోపినాథ్ ముండే, ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.49 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,838

తలనీలాలు సమర్పించినవారు: 22,212

అందమైన అవ్వాచారికోన లోయ



అవ్వాచారి కోన

● ఆత్మహత్యాయత్నాలకు మళ్లీ నిలయం

తిరుమల, జూలై25(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్‌రోడ్డులోని అవ్వాచారికోన లోయ మళ్లీ ఆత్మహత్యాయత్నాలకు నిలయంగా మారుతోంది. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో కొంతమంది, స్వామి సన్నిధిలో ఆత్మహత్య చేసుకుంటే వైకుంఠప్రాప్తి లభిస్తుందని మరికొంత మంది ఇలా అనేక మంది ఆత్మహత్యలు చేసుకునేందుకు ఘాట్‌రోడ్డులోని అవ్వాచారి కోనలోయలో దూకిన సందర్భాలు చాలానే ఉన్నాయి. ఇటీవల కాస్త తగ్గినట్టే అనిపించినా తాజా ఘటనలతో మళ్లీ తిరిగి పెరుగుతున్నాయనిపిస్తోంది. తిరుమల నుంచి తిరుపతికి చేరుకునే మొదటి ఘాట్‌రోడ్డులోని మోకాళ్లమెట్టు ప్రాంతం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకున్న రోడ్డుకు ఎడమవైపు అతిభారీ లోయ ఉంది. ఇదే మార్గంలో అలిపిరి కాలినడకభక్తుల మార్గం కూడా కలుస్తుంది. ఈలోయ కొందరికి ప్రకృతి అందాలను పంచే ప్రాంతంగా ఉంటే మరి కొందరికి ఆత్మహత్యలు చేసుకునేందుకు అనువుగా మారింది. ఐదేళ్ల క్రితం వరకు అవ్వాచారికోన లోయలో ఆత్మహత్యాయత్నాలకు పాల్పడే వారి సంఖ్య అధికంగా ఉండేది. 2010 సెప్టెంబరులో ఈలోయలోకి దూకిన యువతిని మూడురోజుల పాటు గాలించి ప్రాణాలతో కాపాడారు. 2012లోనూ రంగస్వామి అనే యువకుడు కూడా ఇలానే లోయలో పడిపోయాడు. తాను చనిపోయేలా ఉన్నానని, కాపాడాలంటూ అతనే ఫోన్ చేసి పోలీసుల సహాయం కోరాడు. భద్రతా సిబ్బంది అతడ్ని గుర్తించి లోయనుంచి పైకి తీసుకువచ్చేలోపు మృతి చెందాడు. 2018లో కూడా నీరజ అనే యువతి ఆత్యహత్యకు యత్నించింది. వీడియో కాల్ ద్వారా ఆమె ప్రమాదంలో ఉందని గుర్తించి తిరుమల పోలీసులు లోయలోకి దిగి రక్షించారు. 2009 నుంచి 2012 మధ్యలో దాదాపు ఎనిమిది మంది అవ్వాచారి కోనలోయలో మృతి చెందారు. 2018 తర్వాత నిరంతరాయంగా భద్రతాసిబ్బంది నిఘా, భక్తుల రాకపోకలు అధికంగా ఉండటం, తిరుమలలో ఆత్మహత్యలకు పాల్పడితే పాపం అంటూ అర్చకుల నుంచి ప్రకటనలు రావడంతో చాలా వరకు ఆత్మహత్యలకు పాల్పడేవారి సంఖ్య తగ్గింది.



లోయ వద్ద ప్రమాదకరంగా ఫొటో షూట్‌లు

తాజాగా మరో రెండు ఘటనలు

● గతనెల మార్చి నెలలో సిద్దారెడ్డి అనే వ్యక్తి అక్కగార్ల ఆలయానికి సమీపంలోని లోయలోకి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. ఆ సమయంలో హరిబాబు అనే భక్తుడు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు దాదాపు మూడురోజుల పాటు గాలించినా ఆ భక్తుడి ఆచూకీ లభించలేదు. కొద్దినెలల తర్వాత ఆ వ్యక్తి హైదరాబాద్‌లో ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందడంతో ఊపిరి పీల్చుకున్నారు.

● వారం కిందట (బుధవారం) ఆళ్లగడ్డ వాసి మాధవరాయుడు అనే మరో డ్రైవర్ కూడా ఆత్మహత్య చేసుకునేందుకు లోయలోకి దూకేశాడు. అదృష్టవశాత్తు భక్తులు ఇచ్చిన సమాచారంతో గంటల వ్యవధిలోనే భక్తుడిని భద్రతా సిబ్బంది కాపాడారు.

ఏవీ జాగ్రత్తలు?

కాలినడకన అలిపిరిలో బయలుదేరిన భక్తులందరూ తిరుమలకు చేరుకుంటున్నారా అనే రికార్డులేవీ భద్రతాసిబ్బంది వద్ద ఉండవు. మార్గం మధ్యలో ఏం జరిగిన తెలుసుకునే పరిస్థితీ లేదు. అలిపిరి నుంచి తిరుమలకు వరకు సీసీ కెమరాల నిఘా కూడా తక్కువే. ఇప్పటివరకు ఆత్మహత్య చేసుకునేందుకు ఎవరో దూకారంటూ భక్తులు సమాచారమిస్తే తెలిసవే తప్పా నిఘాతో గుర్తించినవి లేవీ లేవు. ఇతర భక్తులు చూడకుండా లోయలో దూకితే గుర్తించే అవకాశమే లేదు. నడకమార్గానికి పక్కనే లోయ ఉన్న క్రమంలో ఆత్మహత్యలకు అనువుగా మారుతోంది. మరోవైపు లోయ ప్రాంతానికి సంబంధం లేకుండా కూడా కాలినడకమార్గంలోనూ అనేక ఆత్మహత్యలు జరిగాయి. ఇందులో ప్రధానంగా 2022 ఆగస్టులో తమిళనాడుకు చెందిన ఓ భక్తుడు ఏడో మైలు వద్ద బ్లేడ్‌తో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే ఏడాది అక్టోబరు నెలలో ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన నాగేశ్వర్‌రెడ్డి అనే యువకుడు గాలిగోపురం వద్ద చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడు. ఈక్రమంలో ఇప్పటికైనా టీటీడీ భద్రతా విభాగం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉంది. లోయకు, కాలినకడమార్గానికి మధ్య ప్రస్తుతం కొంతమేరకే ఇనుపకంచె ఉంది. భక్తులెవ్వరు లోయలోకి దూకకుండా,లేదా సెల్ఫీల ప్రయత్నంలో ప్రమాదవశాత్తు పడిపోకుండా మిగిలిన ప్రాంతంలోనూ కంచెను ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరముంది. అలాగే నడకమార్గం మొత్తం సీసీ కెమెరాల నిఘా అవసరం. వీటితో పాటు భద్రతా సిబ్బందితో నిరంతరాయంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ నిఘా పెంచాలి. అలిపిరిలో మొదలైన భక్తులు తిరుమలకు చేరుతున్నారా లేదా అని తెలుసుకునే వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాలి. ఇవన్నీ చేస్తే తప్పా ఆత్మహత్యయత్నాలు తగ్గవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎర్రచందనం స్మగ్లర్లకు ఐదేళ్ల జైలు

● రూ.3 లక్షల జరిమానా



నిందితులతో పోలీసులు

పిచ్చాటూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లకు శుక్రవారం తిరుపతి రెడ్ శాండిల్ స్పెషల్ కోర్టు జడ్జి నరసింహమూర్తి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధించారు. పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేశ్వరులు తెలిపిన వివరాలు... 2018 డిసెంబరు 25న అప్పటి ఎస్ఐ రామాంజనేయులు సిబ్బందితో మండలంలోని రెప్పాలపట్టు వద్ద తనిఖీలు నిర్వహించారు. శ్రీకాళహస్తి నుంచి రెండు కార్లు చెన్నై వైపు వెళ్తుండగా నిలిపి తనిఖీ చేశారు. రెండు వాహనాల్లో 44 ఎర్రచందనం దుంగలున్నట్టు గుర్తించారు. వాహనాలు సహా ఎర్రచందనం దుంగలను స్టేషన్‌కు తరలించారు. తమిళనాడు రాష్ట్రం కాంచీపురం జిల్లా శంకరాపురానికి చెందిన ఎం.భాస్కర్, చెంబరంబాక్కానికి చెందిన పుగ ఎంతి, మేట్ స్ట్రీట్‌కు చెందిన ప్రభు, కొన్నికుప్పానికి చెందిన హుస్సేన్‌ను అరెస్టు చేశారు. ఈ క్రమంలో సత్యవేడు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి రెడ్ శాండిల్ స్పెషల్ కోర్టులో ట్రయల్ జరుగుతోంది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణ నాయుడు వాదనల మేరకు నిందితులకు శిక్ష ఖరారైంది. కాగా స్మగ్లర్లను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఎస్ఐ వెంకటేష్, ఏఎస్ఐ వెంకటరాజు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన టిప్పర్

● మహిళ మృతి ● ముగ్గురికి తీవ్ర గాయాలు


● ఆటో డ్రైవర్ పరిస్థితి విషమం



మృతి చెందిన పోలమ్మ

కోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చిట్టేడు వద్ద శుక్రవారం ఆటోను టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో ఒక మహిళ మృతి చెందగా, ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. స్థానికుల కథనం మేరకు వివరాలు... మండల పరిధిలోని చిట్టేడు బీసీ కాలనీకి చెందిన పలువురు మహిళలు ఉపాధి పనులకు వెళ్లేందుకు సమీపంలో ఉన్న కోట - గూడూరు రోడ్డు వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఆటోలో గ్రామ పొలిమేరల్లో ఉన్న గుంటల్లో పనులకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. రోడ్డు పక్కన ఆగిన ఉన్న ఆటో ఎక్కుతుండగా గూడూరు కంకర్ లోడ్‌తో వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బత్తల పోలమ్మ(65) అక్కడికక్కడే మృతి చెందగా, ఆటోలో ఉన్న తలారి గంగమ్మ, నందిమాల నిర్మలమ్మ, ఉత్తమనాడు బాలమ్మతో డ్రైవర్ పోలూరు కృష్ణ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం గూడూరు, నెల్లూరు ఆస్పత్రులకు తరలించారు. ఆటో డ్రైవర్ కృష్ణ తలకు బలమైన గాయం తగలడంతో ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలిసింది. ఎస్ఐ పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్‌కు పుత్తూరు సీఐ



పుత్తూరు అర్బన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సీఐ సురేంద్రనాయుడిని వీఆర్‌కు పంపుతూ ఎస్పీ హర్షవర్ధనరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన పనితీరు మొదటి నుంచి వివాదాస్పదమవుతూనే ఉంది. బియ్యం అక్రమ వ్యాపారుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. మద్యం వ్యాపారుల నుంచి అక్రమ వసూళ్ల విషయంపై ఎస్పీకి ఫిర్యాదులందాయి. వీటన్నింటిపై ఎస్పీ ప్రత్యేక సిబ్బంది ద్వారా విచారణ చేయించి నివేదికలను తెప్పించుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఆయన్ను ఎస్పీ వీఆర్‌కు పంపారు. రెండు నెలల క్రితం అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఇదే స్టేషన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్‌ను కూడా వీఆర్ పంపించారు.

కుమారస్వామికి పల్లకీసేవ



పల్లకిలో స్వామికి హారతులు

శ్రీవళ్లీ, దేవసేన

శ్రీకాళహస్తి, జూలై 25(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని విజ్ఞానగిరిపై కొలువైన కుమారస్వామి ఆడికృత్తిక వార్షికోత్సవాల్లో భాగంగా చివరిరోజైన శుక్రవారం ముక్కంటి ఆలయంలో పల్లకీసేవ కనుల పండువగా సాగింది. వళ్లీ, దేవసేన సమేత కుమారస్వామి పల్లకీలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

● ఆరంబాక్కంలో చిన్నారిపై అత్యాచార నిందితుడు

సూళ్లూరుపేటలో పట్టుబడ్డాడు



సూళ్లూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా ఆరంబాక్కంలో చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డ యువకుడు.. శుక్రవారం రాత్రి తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో పట్టుబడ్డాడు. రైల్వే స్టేషన్ వద్ద ఇతడిని ఆరంబాక్కం పోలీసులు పట్టుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. ఆరంబాక్కంలో ఈ నెల 12వ తేది సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి నడిచి వెళ్తున్న నాలుగో తరగతి చదివే బాలికపై ఓ యువకుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తమిళనాడులో కలకలం రేపింది. దీనిపై ప్రతిపక్షాలు సైతం ఆందోళన చేశాయి. ఈ క్రమంలో తిరువళ్లూరు ఎస్పీ వివేకానంద శుక్లా 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుడి ఆచూకీ కోసం అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా గాలించారు. ఘటన జరిగిన రోజు నిందితుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడినట్లు గుర్తించారు. నిందితుడి ఎవరెవరితో మాట్లాడాడనే వివరాలు సేకరించారు. సంఘటన స్థలంలోని సీసీ కెమెరాల ద్వారా నిందితుడు పలు ప్రాంతాల్లో.. లోకల్ మెమో రైళ్లలో తిరిగే ఫొటోలను పోలీసులు గుర్తించారు. ఈ ఫొటోలను 22వ తేదీన ఆరంబాక్కం పోలీసులు విడుదల చేశారు. ఇతడి ఆచూకీ చెబితే రూ.5 లక్షలు నజరానా ఇస్తామని ప్రకటించారు. సూళ్లూరుపేట, తడ, వరదయ్యపాళెం ప్రాంతాల్లో నిందితుడు తిరుగుతున్నట్లు గుర్తించి.. మూడు రోజులుగా విస్తృతంగా గాలిస్తున్నారు. ముఖ్యంగా గుమ్మడిపూడి నుంచి సూళ్లూరుపేట వరకు రైల్వే స్టేషన్లలో దృష్టి పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ మూడో ప్లాట్‌ఫారం వద్ద తిరుగుతున్న నిందితుడిని ఆరంబాకం పోలీసులు చాకచక్యంతో పట్టుకుని తీసుకెళ్లారు. శనివారం తమిళనాడులో అరెస్టు చూపే అవకాశం ఉంది.

● భార్య, బిడ్డలను చంపిన

నిందితుడి అరెస్ట్



నిందితుడు గిరిని అరెస్ట్ చేసిన పోలీసులు

పాకాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భార్య, ఇద్దరు బిడ్డలను బావిలోకి తోసి హతమార్చిన నిందితుడు టి.గిరిని పోలీసులు అరెస్టు చేశారు. పాకాల సీఐ సుదర్శన ప్రసాద్ తెలిపిన ప్రకారం.. మండలంలోని మద్దినాయనిపల్లె పంచాయతీ పెద్దహరిజనవాడకు చెందిన గిరికి, చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరు పంచాయతీ తలారివారిపల్లెకు చెందిన హేమంతకుమారితో 13 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి తనుశ్రీ (11), తేజశ్రీ (7) కుమార్తెలు. పదేళ్లుగా వీరు తిరుపతిలో నివాసం ఉంటున్నారు. ప్రకాశం పార్కు మునిసిపల్ స్కూల్ వద్ద హేమంతకుమారి పండ్లదుకాణం నిర్వహిస్తుండగా, గిరి ఎలక్ట్రీషిన్‌గా పనిచేసేవాడు. పుట్టింటినుంచి భూమి అమ్మి డబ్బులు తేవాలని భార్యను వేధించేవాడు. లేదంటే చంపేస్తానంటూ బెదిరించేవాడు. అప్పుడప్పుడు కొంత డబ్బులు తెచ్చినా తృప్తి పడలేదు. భూమి అమ్మి పెద్దమొత్తంలో తీసుకురాలేదనే కోపంతో భార్యాబిడ్డలను చంపాలని నిర్ణయించుకున్నాడు. తిరుపతి నుంచి భార్యా పిల్లలతో అక్క ఇంటికి వచ్చాడు. అక్కడ్నుంచి స్వగ్రామం ఓబుల శెట్టివారిపల్లెలోని పెద్దహరిజనవాడకు వచ్చాడు. ఈనెల 17వ తేదీన తిరుగు ప్రయాణంలో మద్దినాయనిపల్లె- కొమ్మిరెడ్డిగారిపల్లె రోడ్డులో కొత్తవడ్డిపల్లె ఊట్ల బావిదగ్గర చేపలు చూద్దామని నమ్మకంగా తీసుకెళ్లాడు. బావిలో చేపలు చూపిస్తున్నట్లు నటిస్తూ.. భార్య, ఇద్దరు పిల్లలను తోసి చంపేశాడు. ఇంతలో సమీపంలోని వారు అటు రావడంతో గొంతు కోసుకున్నట్లు నటించి పారిపోయాడు. నిందితుడికోసం గాలించి.. గురువారం సాయంత్రం అరెస్టు చేసి శుక్రవారం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ చెప్పారు.

హెడ్‌మాస్టర్ మందలించారని..

● అనంతపురం నుంచి తిరుమల చేరుకున్న నలుగురు విద్యార్థులు

● గుర్తించి అప్పగించిన పోలీసులు



పారిపోయి వచ్చిన విద్యార్థులు

తిరుమల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): హెడ్‌మాస్టర్ మందలించారని పారిపోయి తిరుమల చేరుకున్న నలుగురు అనంతపురం విద్యార్థులను తిరుమల పోలీసులు తిరిగి వారి కుటుంబాలకు అప్పగించారు. అనంతపురంలోని బీసీ బాలుర వసతి గృహంలో ఉంటూ పొట్టి శ్రీరాములు నేతాజీ స్కూల్‌లో చదువుకుంటున్న నలుగురు విద్యార్థులను సరిగా చదవడంలేదని హెడ్ మాస్టర్ మందలించారు. టీసీలు ఇచ్చి పంపేస్తానని హెచ్చరించాడు. గురువారం స్కూల్ నుంచి వీరు తిరిగి రాకపోవడంతో హాస్టల్ వార్డన్ అనంతపురం 3వ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా వీరు తిరుమలలో ఉన్నట్టు గుర్తించారు. శుక్రవారం ఉదయం తిరుమల పోలీసులకు బాలుర ఫోటోలు పంపారు. వెంటనే అప్రమత్తమైన కమాంట్ కంట్రోల్, విజిలెన్స్, ట్రాఫిక్, బీట్ సిబ్బంది సీసీ కెమెరాలను పరిశీలించారు. నలుగురు బాలురు అలిపిరి మెట్ల మార్గంలో తిరుమల నుంచి తిరుపతికి వెళుతున్నట్టు గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సాయంత్రం అనంతపురం పోలీసులకు అప్పగించారు. సకాలంలో స్పందించి పిల్లలను గుర్తించిన తిరుమల పోలీసులను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అభినందించారు.

రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కోసం...

ఏపీఐఐసీ భవనం పరిశీలన



వికృతమాల వద్ద ఏపీఐఐసీ నిర్మించిన భవనాలను పరిశీలిస్తున్న ఐఏఎస్ సూర్యతేజ, జిల్లా అధికారులు

ఏర్పేడు, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి ఐఐటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ శాశ్వత భవనం కోసం ఏపీఐఐసీ నిర్మించిన భవనాలను పరిశీలించారు. వాస్తవానికి ఇన్నోవేషన్ హబ్‌ను ఈనెల 19న సీఎం చంద్రబాబు ప్రారంభించాల్సి ఉంది. అయితే సీఎం షెడ్యూల్‌లో మార్పులతో ప్రారంభంకాలేదు. ఇదిలా ఉండగా రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు శాశ్వత భవనం కోసం ఏపీ టెక్నాలజీ సర్వీసెస్(ఏపీటీఎస్) ఎండీ సూర్యతేజ అధికారులతో కలిసి వికృతమాల సమీపంలో ఉన్న ఏపీఐఐసీ నిర్మించిన నూతన భవనాన్ని శుక్రవారం పరిశీలించారు. అనంతరం రేణిగుంట మండలంలో కూడా కొన్ని ప్రాంతాల్లో ఇటీవల నూతనంగా నిర్మించిన భవనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం భన్సల్, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఏర్పేడు తహసీల్దారు భార్గవి, పలువురు ఏపీఐఐసీ అధికారులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్

● ఆక్స్ ఎయిర్ పరిశ్రమతో ఎంఓయూ

సత్యవేడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలైజాకీ అధికారుల బృందంతో శుక్రవారం శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ సీనియర్ వైస్ చైర్మన్ ఆర్.శివశంకర్ వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. కాన్సుల్ జనరల్‌తో చర్చల సందర్భంగా పారిశ్రామిక అభివృద్ధిని వివరించిన శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి 31 దేశాలకు చెందిన 240కి పైగా పరిశ్రమలు శ్రీసిటీలో స్థాపించాయని తెలిపారు. విభిన్న రంగాల్లో పెట్టుబడి అవకాశాల కోసం అన్వేషిస్తున్న కంపెనీలకు శ్రీసిటీ గమ్యస్థానం అన్నారు. శ్రీసిటీలోని వెంచర్ ఆటోమోటివ్ ఇండియా పరిశ్రమ (ఆస్ట్రేలియా ఉమ్మడి భాగస్వామ్య కంపెనీ) దీనికి ఉదాహరణగా పేర్కొన్నారు. ప్రపంచ శ్రేణి మెట్రో రైళ్లను తయారు చేసే ఆల్‌స్టామ్ కంపెనీ మొట్టమొదటి పూర్తిస్థాయి ఆటోమోటెడ్ మెట్రో రైళ్లను సిడ్నీ మెట్రోకు సరఫరా చేయడం ఇండియా - ఆస్ట్రేలియా పారిశ్రామిక సహకారంలో మైలురాయిగా సన్నారెడ్డి అభివర్ణించారు. శ్రీసిటీ వ్యాపారానుకూలత పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ భారత్‌లో అత్యుత్తమ వ్యాపార కేంద్రాల్లో శ్రీసిటీ ఒకటని అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఆక్స్ ఎయిర్ పరిశ్రమతో ఎంఓయూ

ఈ పర్యటనలో కీలకాంశంగా కాన్సుల్ జనరల్ సిలైజాకీ సమక్షంలో శ్రీసిటీలో పరిశ్రమ ఏర్పాటుకు ఆస్ట్రేలియాకు చెందిన ఇంజనీరింగ్ సంస్థ ఆక్స్ ఎయిర్ ప్రెజర్ వెసెల్స్ మానుఫ్యాక్చరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటుకు శ్రీసిటీతో ఒప్పందం కుదుర్చుకుంది. పారిశ్రామిక అవసరాలకు ఉపయోగపడే వివిధ గ్యాస్‌లను నిల్వచేసే అధిక పీడన ట్యాంకులను ఈకంపెనీ తయారు చేస్తుంది.



ఎంవోయూ మార్చుకుంటున్న కాన్సుల్ జనరల్, శ్రీసిటీ ఎండీ

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

నలుగురికి స్వల్పగాయాలు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

నాయుడుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - విన్నమాల జాతీయ రహదారి ఫ్లై ఓవర్ వద్ద అదుపుతప్పి కారు విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. విశాఖపట్నానికి చెందిన శ్రీనాథ్, ఆయన సతీమణి, ఇద్దరు పిల్లలు శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. నాయుడుపేట వద్ద వెళ్తుండగా ముందు వెళ్తున్న వాహనాన్ని అదిగమించబోయిన కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనాథ్ దంపతులతో పాటు ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు నాయుడుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. కారు ముందుభాగం దెబ్బతింది.

మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు

గూడూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలను నాటడం బాధ్యతగా భావించాలని ఎస్కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. శుక్రవారం కళాశాలలో ఎస్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో ప్రాజెక్టు అరణ్య కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొక్కలు నాటడం సమాజ శ్రేయస్సుకు పునాదిలాంటిదని, ప్రతిఒక్కరూ మొక్కలను నాటడంతో పాటు వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పీర్ కుమార్, విజయ మహేష్, నారాయణరాజు, కోటేశ్వరరావు, కిరణ్మయి, శ్రీధర్‌శర్మ, ఝాన్సీరాణి, శైలజ, రవిరాజు తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ రమణ

వెంకటగిరి టౌన్, జూలై 25(ఆంధ్రజ్యోతి): చెడు అలవాట్లకు యువత దూరంగా ఉండాలని వెంకటగిరి సీఐ రమణ అన్నారు. శుక్రవారం పట్టణంలోని విశ్వోదయ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్, పోక్సో చట్టం, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఫ్యాషన్ కోసం డ్రగ్స్ వినియోగిస్తూ క్రమంగా బానిసలుగా మారి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అన్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కూడా ర్యాగింగ్ చేస్తున్నారని, అలాంటి అలవాట్లు మార్చుకుని మంచి నడవడిక అలవర్చుకోవాలని సూచించారు. ఇక ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇలాంటివి జరిగినప్పుడు 112 ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాలాయపల్లి: మండల పరిధిలోని వెంగమాంబపురం కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఐ గోపి మాట్లాడుతూ బాలికల భద్రత, చెడు వ్యసనాలు, మత్తు పదార్థాల వల్ల అనర్థాలు, సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

దేశానికి ఇస్రో సహకారంపై సెమినార్



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్, పీఆర్ఎల్ డైరెక్టర్ భరద్వాజ్ తదితరులు

సూళ్లూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో ఎంఆర్ కురుప్ ఆడిటోరియంలో శుక్రవారం డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన హిందీలో సాంకేతి సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన పీఆర్ఎల్ డైరెక్టర్ అనిల్ భరద్వాజ్ అభివృద్ధి చెందిన 'భారత దేశానికి ఇస్రో సహకారం, సౌర వ్యవస్థ అన్వేషణ' అనే అంశంపై హిందీలో వివరించారు. షార్ ఇన్-హౌస్ జర్నల్ ప్రజ్వల్ ఒక పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఎస్ఏ గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణ, షార్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్

సూళ్లూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ముద్ర, వ్యవసాయం, పొదుపు మహిళలకు బ్యాంకర్లు సకాలంలో రుణాలు అందించాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మూడు మండలాల బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ రూపాల్లో అందించే రుణాలను లబ్ధిదారులకు సకాలంలో అందితేనే ప్రయోజనమన్నారు. ఎటువంటి పూచీకత్తు లేకుండా బ్యాంకర్లు రుణాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం వెంకటేశ్వర్లు, ఏపీవో విజయకుమార్, ఏపీఎంలు ప్రసన్న కుమారి, రాజారెడ్డి, మునిరాజయ్య, సీసీలు ఉమాశంకర్, మునెయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌పై అసత్య ఆరోపణలు మానుకోవాలి

గూడూరు, చిల్లకూరు, చిట్టమూరు, కోట, వాకాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌పై వైసీపీ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను మానుకోవాలని టీడీపీ ఎస్సీసెల్ నాయకులు అన్నారు. శుక్రవారం గూడూరు, చిల్లకూరు, చిట్టమూరు, కోట, వాకాడు మండలాల్లో టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎస్సీ, ఎస్టీ పేదల అభివృద్ధికి కృషిచేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ గురించి వైసీపీ నాయకులు వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలన్నారు. ఎస్సీ ఎస్టీలకు గుర్తింపునిచ్చి వారి ఎదుగుదలకు ఎమ్మెల్యే ప్రోత్సాహాన్ని అందిస్తున్నారన్నారు. వాకాడు మండలానికి చెందిన కొందరు వైసీపీ నాయకులు ఎమ్మెల్యేపై చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండించారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



శివ (ఫైల్‌ఫొటో)

సూళ్లూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట తహసీల్దార్ కార్యాలయ వెనుక వైపు ఓ వ్యక్తి ఉరేసుకుని మృతి చెందిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని వత్రపాలెం ప్రాంతానికి చెందిన కేశవుల శివ(52) తహసీల్దారు కార్యాలయం వెనుక ఉన్న కానుగచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం ఉదయం స్థానికులు గమనించి పోలీసులకు సమచారం అందంచారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతుడి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మద్యానికి బానిసైన శివ కుటుంబ సభ్యులతో తరచూ గొడవపడేవాడని, మూడు రోజుల నుంచి ఇంటికి కూడా వెళ్లలేదని తెలిసింది. మృతదేహాన్ని మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







నిర్మాణంలో ఉన్న గురుకుల పాఠశాల భవనం - నిర్మాణానికి వాడుతున్న నాసిరకం కంకర, ఇటుకలు

నాసిరకంగా గురుకుల భవనాల నిర్మాణం

దొరవారిసత్రం, జూలై 25(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం బీసీ గురుకులంలో అదనపు గదుల నిర్మాణం నాసిరకంగా జరుగుతోంది. గురుకుల విద్యాలయంలో లైబ్రరీ, ల్యాబ్ రేటరీ కోసం ఐదు అదనపు గదులను నిర్మించేందుకు పీఎంశ్రీ పథకం కింద ప్రభుత్వం సుమారు రూ.కోటి మంజూరు చేసింది. ఆరు నెలల క్రితం పనులు చేపట్టిన కాంట్రాక్టరు పాత భవనంపై ఒక గదిని పూర్తి స్థాయిలో నిర్మించారు. మరో నాలుగు గదుల పనులు జరుగుతున్నాయి. రెండు గదులు కింద, మరో రెండు గదులు పైఅంతస్తులో నిర్మిస్తున్నారు. గోడలకు వాడుతున్న ఇటుకలు, స్లాబ్ పనులకు వినియోగిస్తున్న మెటల్ నాసిరకంగా ఉంటోంది. ఈ విషయాన్ని ఏఈ జనార్దన్‌ను దృష్టికి తీసుకెళ్లగా గదుల నిర్మాణానికి వాడుతున్న ఇటుకలు నాసిరకంగా ఉండడంతో వాటిని ఉపయోగించకుండా ఆపేశామని తెలిపారు. పనుల్లో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వెంకటగిరిని ఆదర్శంగా తీర్చిదిద్దుతా: కురుగొండ్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, జులై 25(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిని జిల్లాలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చిన్నన్నపేట పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. రూ.కోటి 80లక్షల వ్యయంతో నిర్మించనున్న తారురోడ్డు నిర్మాణానికి భూమిపూజ, గ్రామంలో రూ.8 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్లు, రూ.5 లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంటు, రూ.43 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాలకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ గ్రామంలోనూ తట్టడు మట్టి వేసిన పాపాన పోలేదన్నారు. వైసీపీ అధినేత జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనను గాడిలో పెట్టి అభివృద్ధిబాట పట్టించారని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం 80 శాతం అమలు చేసిందన్నారు. ఆగస్టు 15నుంచి మహిళకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరుగుతుందన్నారు. కాగా, సభాప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తన ఫొటో లేకపోవడంతో ఎంపీపీ తనూజా రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. సభావేదిక పైకి వెళ్లేందుకు ఆమె నిరాకరించారు. గతంలోనూ ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడి తనను అవమాన పరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే కురుగొండ్ల ఆమెకు నచ్చచెప్పడంతో సభా వేదికపైకి వచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాథనాయుడు, ఎంపీడీవో గుణశేఖరరెడ్డి, సీఐ రమణ, ఎస్ఐ ఎడుగొండలు, నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడు జన్ని రమణయ్య, మండల అధ్యక్షుడు పప్పు చంద్రమౌళి రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కూని సూరి, మురళి, నక్కల వెంకట్రామయ్య, శివ నారాయణ, జీకేపల్లి బాబు నాయుడు, నాయులు చలపతి నాయుడు, శేషాద్రి, మగ్గం వెకటాచలం తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మీనాక్షి సుందరి

కోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి కోరారు. కోటలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అద్దూరు వెంకటేశ్వర్లు, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మోహన్, న్యాయవాదులు బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం

కోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని వెలుగు ఏపీఎం అనీలా అన్నారు. కోటలోని వెలుగు కార్యాలయంలో శుక్రవారం వీవోఏలు, సీసీలతో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలకు రుణాల చెల్లింపుల్లో అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా సంఘాల వారీగా ఉన్న లక్ష్యాలపై నివేదికలు తయారు చేయాలని సూచించారు. సమావేశంలో సీసీలు శ్రీకాంత్, భాస్కర్, ప్రసాద్, శంకర్, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిజైన్ నైపుణ్యాలపై ముగిసిన శిక్షణ

కోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో 6 వారాలుగా జరిగిన డిజైన్ శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. బెంగళూరుకు చెందిన డైనమిక్ ఇంజనీరింగ్ సర్వీస్ అధిపతి నాగార్జున పాల్గొని డిజైన్ నైపుణ్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రాస్టింగ్ వంటి విభాగాల్లో డిజైనింగ్‌కు కావాల్సిన నైపుణ్యాల గురించి వివరించారు. శిక్షణ పొందిన విద్యార్థులకు ప్రసంశాపత్రాలను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విక్రమ్‌కుమార్, డాక్టర్ అశోక్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఇళ్ల పట్టాల పంపిణీ వాయిదా

తడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తడ మండలం పూడికుప్పానికి వలస వచ్చే ఇరకంకుప్పం గ్రామస్తులకు శుక్రవారం ఇవ్వాల్సిన ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం వర్షం కారణంగా వాయిదా పడింది. ఇరకం కుప్పం గ్రామస్తులకు పూడిక్కుప్పంలో ఇళ్ల పట్టాలు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతుల మీదుగా ఇచ్చేందుకు కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం 6గంటలకు ఈదురు గాలులతో కూడి భారీవర్షం కురవడంతో ఏర్పాటు చేసిన వేదిక కూలిపోయింది. దీంతో గ్రామంలో ఉన్న పోలేరమ్మ ఆలయంలో కార్యక్రమం నిర్వహించి పట్టాలు అందించాలని అనుకున్నారు. అయితే వాతావరణం సహకరించపోవడంతో కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు.

అంధ క్రీడాకారుడికి ఆర్థిక సాయం



శేషగిరికి చెక్కు అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, డాక్టర్ రమేష్‌నాథ్

వెంకటగిరి, జులై 25(ఆంధ్రజ్యోతి): వెంకటగిరికి చెందిన అంధ క్రీడాకారుడు ముప్పాళ్ల శేషగిరి ఇటీవల జరిగిన జాతీయ స్థాయి గోల్బాల్ పోటీల్లో ప్రతిభ చూపి సెప్టెంబరులో ఈజిప్టులోని అలెగ్జాండ్రియలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఆయన విదేశీ ప్రయాణానికి అవసరమైన ఖర్చుల కోసం రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ రమేష్ నాథ్ లింగుట్ల కలెక్టర్ వెంకటేశ్ చేతుల మీదుగా ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో అంధుల క్రీడా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి పెంచల నరసయ్య నాయుడు, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ సభ్యులు నరసింహులు, నారాయణ, పద్మనాభ మునిలక్ష్మి, అంకయ్య, బ్లైండ్స్ అసోషియేషన్ కార్యదర్శి రంగినేని రాజా తదితరులు పాల్గొన్నారు.

పారదర్శక పాలనకు సహకారం



శ్రీనివాసులును సత్కరిస్తున్న స్థానికులు, సచివాలయ సిబ్బంది

కోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు సచివాలయంలో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన, బదిలీపై ఇక్కడకు వచ్చిన ఉద్యోగులతో శుక్రవారం స్థానిక టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టేడు సహకార సంఘ ఛైర్మన్ చాపల శ్రీనివాసులు, టీడీపీ నాయకులు చిట్టేటి నాగూరయ్య, కసుమూరు వెంకటేశ్వర్లు, పసుపులేటి వేణు మాట్లాడుతూ ఉద్యోగులు పారదర్శక పాలన అందించాలని కోరారు. ఉద్యోగులు స్పందిస్తూ పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం చిట్టేడు సహకార సంఘ ఛైర్మన్ చాపల శ్రీనివాసులును గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది సత్కరించారు.

నష్టపరిహారం అందించాలని నిరసన

చిల్లకూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సాగమాల రోడ్డుకు ఇచ్చిన భూములకు నష్టపరిహారం అందించాలంటూ మండలంలోని తొణుమాల, ఉడతావారిపాళ్లపల్లి గ్రామస్తులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు మాట్లాడుతూ సాగరమాల రోడ్డు నిర్మాణంలో తాము భూములు కోల్పోయామన్నారు. కొంతమందికి ఇప్పటికీ నష్టపరిహారం అందించలేదన్నారు. తహసీల్దారు శ్రీనివాసులు రైతులతో చర్చించి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నెలరోజుల్లో నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుటామని హామీ ఇచ్చారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దారు శ్రీనివాసులు

చెత్త తొలగించారు



రైల్వేగేటు వద్ద చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సూళ్లూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట రైల్వేగేటు దక్షిణవైపు రోడ్డులో ఇటీవల తొలగించిన అండర్ బ్రిడ్జి నిర్మాణానికి తెచ్చిన సిమెంట్ దిమ్మెలు ఉన్న చోట చెత్త పేరుకు పోయింది. మూడు రోజుల క్రిత సిమెంట్ దిమ్మెలు తొలిగించారే కానీ చెత్తను తొలగించ లేదు. 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం సిమెంట్ దిమ్మెలు తొలిగించారు.. చెత్తను తీయడం మరిచారు' శీర్షికన రావడంతో మున్సిపల్ కమిషన్ చిన్నయ్య స్పందించి పారిశుధ్య కార్మికులతో చెత్తను తొలిగింపజేశారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

గూడూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టనంలోని గాంధీనగర్‌కు చెందిన సంకీర్తన తిరుపతిలో నర్సింగ్ చదువుతోంది. విద్యార్థిని కళాశాల పీజుల నిమిత్తం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ దాతృత్వంతో టీడీపీ నాయకులు శుక్రవారం రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఏసుపాక పెంచలయ్య, రావూరు సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పీ4తో పేదరిక నిర్మూలన



సమావేశంలో మాట్లాడుతున్న శివకుమార్

పెళ్లకూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన నుంచి రూపొందిన పీ4 కార్యక్రమంతో నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు పంచాయతీ సర్పంచు కందమూడి శివకుమార్ అన్నారు. శుక్రవారం మండలం లోని 13 గ్రామ సచివాలయాల్లో పీ4 గ్రామసభలు నిర్వహించారు. చిల్లకూరు సచివాలయంలో జరిగిన గ్రామసభలో బంగారు కుటుంబాలుగా ఎంపికైన వారి జాబితాను శివకుమార్ వెల్లడించారు. కార్యక్రమంతో పంచాయతీ కార్యదర్శులు సమ్మన శ్రీహరి, సుజాతమ్మ పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు

గూడూరు అర్బన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక హైస్కూల్ రోడ్డులోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో శుక్రవారం శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సూళ్లూరుపేటలో భారీ వర్షం

సూళ్లూరుపేట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి కారు మబ్బులు కమ్ముకుని చల్లగా ఉన్న వాతావరణం సాయంత్రం ఒక్కసారిగా నల్లని మబ్బులు కమ్మి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఆర్టీసీ బస్టాండు, హోలిక్రాస్ సమీపంలో జీఎన్‌టీ రోడ్డు, స్టేట్‌బ్యాంక్ రోడ్డులో వర్షపునీరు నిలిచింది. మండలంలో మంగళంపాడు, ఇలుపూరు, మంగానెల్లూరు వెంగలాపురం, కోటపోలూరు, ఆబాక తదితర గ్రామాల్లో వరిపైరు ఎన్నుదశలో ఉంది. పలుచోట్ల వరికోతలు కోయాల్సి ఉంది. ఈ వర్షంతో రైతుల భయాందోలన చెందుతున్నారు.

శ్రావణమాస ప్రత్యేక పూజలు



నాయుడుపేట టౌన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ ఆలయంలో శ్రావణ మాస మొదటి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని 100 చీరలతో అలంకరించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.